

ఆంధ్రజ్యోతి



జంగారెడ్డిగూడెం నుంచి ఒక లారీ జీడిపిక్కల లోడ్‌తో బయలుదేరింది.. అప్పటి వరకూ కష్టపడిన కూలీలు లోడ్‌పైనే ఆదమరుపుగా నిద్రపోయారు..అర్ధరాత్రి.. చిమ్మచీకటి.. ఎదురుగా ఉన్న రోడ్డు కూడా సరిగా కనిపించదు.. అయినా లారీ వెళుతూ ఉంది.. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం వద్దకు వచ్చేసరికి లారీ ఒక చిన్న గోతిలో పడింది.. అంతే అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి జారిపోయింది.. లారీ బోల్తా పడిపోయింది. లోడు పైన ఉన్న ఏడుగురు కూలీలు బస్తాల కింద కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందారు. అదే పగలైతే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదు..ఏడు కుటుంబాల్లో ఆ రాత్రి మళ్లీ వెలుగురాని చీకటి నింపింది..

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు సోదరులు.. తల్లితో కలిసి జీవనోపాధి నిమిత్తం వైజాగ్‌లో ఉండేవారు.. అయితే ఇటీవల అక్కడి నుంచి పల్సర్ బైక్‌పై నలుగురు తమ స్వగ్రామం బయలుదేరారు.. తెల్లవారేసరికి ఇంటికి చేరుకోవాలనుకునే కంగారు.. బైక్‌పై వేగంగా వెళుతున్నారు.. మరో వైపు వర్షం పడుతూనే ఉంది.. నిద్రమత్తు కారణమో ఏమో తెలియదు కానీ కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి వద్దకు వెళ్లేసరికి బైక్ ఒక్కసారిగా జారిపోయింది.. అంతే నలుగురు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు.. తల్లి ఒక పక్కకు పడి పోగా ముగ్గురు కుమారుల పైనుంచి లారీ వెళ్లిపోయి మృతిచెందారు.ఆ కుటుంబంలో ఆ రాత్రి చీకటిని నింపింది.

ఎక్కడెక్కడో తిరిగొచ్చారు..ఆ ముచ్చట్లు కుటుంబీకులతో పంచుకోవాలనుకుంటూ ఆనందంగా వెళుతున్నారు.. రావులపాలెం మండలం ఈతకోట వచ్చేసరికి నిద్ర రావడంతో భర్త కారును పక్కగా నిలిపి పడుకుందామన్నాడు.. అయితే భార్య మాత్రం దగ్గరే కదా వెళ్లిపోదాం అంటూ స్టీరింగ్ తీసుకుంది.. అంతే కొద్ది దూరం వెళ్లేసరికి చీకటి కావడంతో రోడ్డును అంచనా వేయలేకపోవడంతో కారు కాలువలోకి దూసుకుపోయింది.. భర్త కళ్లెదుటే భార్య.. ఇద్దరు చిన్నారులు నీటిలో కొట్టుకుపోయారు.. తెల్లవారేసరికి చూస్తే విగతజీవులుగా మారారు.. అంతే ఆనందం ఒక్కసారిగా ఆవిరైపోయింది.. భర్తకు చీకటే మిగిలింది.

చీకట్లోకి.. జీవితాలు!



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామ శివారు చిలకావారిపాకలవద్ద వద్ద సెప్టెంబరు 10వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడిన ఏడుగురు కూలీలు

రాత్రి ప్రయాణం ప్రమాదకరం

చీకటి చాలా ప్రమాదకరమైనది.. ఎంతంటే ఎన్నో జీవితాలను తనలో కలిపేసుకుంటుంది.. బతికిఉన్నంత కాలం పలువురు జీవితాలను చీకట్లోకి నెట్టివేస్తుంది.. ఎవరికైనా తమ వారు తోడుంటేనే ఆనందం.. అందరూ ఉండి ఒక్కరూ లేకపోయినా ఏదో వెలితిగా ఉంటుంది.. పండగైనా.. ఫంక్షన్ అయినా వారులేని లోటు జీవితాంతం బంధువులను పీడిస్తూనే ఉంటుంది..అయినా రాత్రి వేళ ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేవారే కానరావడంలేదు. అసలు చీకట్లోనే ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి అని ఆరాతీస్తే.. అందులో ఒక వైపు అధికారులు.. మరో వైపు వాహనదారుల స్వయం తప్పిదమూ ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. నిబంధనలపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక నిద్ర ముంచుకొస్తున్నా ఇంటికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

శంఖవరం/కొవ్వూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాత్రి ప్రయాణం చాలా ప్రమాదకరం.. ఎన్నో జీవితాలు చీకట్లో కలిసిపోయాయి. ప్రస్తుతం ఆయా కుటుంబాలు జీవచ్ఛవాలుగా మారాయి. అయినా నేటికీ మార్పురావడంలేదు. వాహనదారులు మేల్కోవడంలేదు. రాత్రి సమయంలో ప్రయాణించి జీవితాలను పణంగా పెడుతున్నారు..అయినవారిని కోల్పోతున్నారు. కోనసీమ జిల్లా గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారు జామున జరిగిన సంఘటన అటువంటిదే. ఎక్కడెక్కడో కుటుంబం అంతా ఆనందంగా గడిపారు.. మంగళవారం తెల్లవారేసరికి స్వగ్రామం చేరుకోవాలని సోమవారం రాత్రికి బయలుదేరారు.. అంతా వారనుకున్నట్టు జరిగితే విహారయాత్ర ముచ్చట్లతో ఆ ఇల్లంతా సందడిగా ఉండేది. అయితే నిద్రమత్తు.. రోడ్డును అంచనావేయలేకపోవడం తదితర కారణాలతో ఆ కుటుంబం తీవ్ర విషాదంతో నిండింది.రాత్రి కావడంతోనే ఈ ప్రమాదం జరిగింది. అదే పగలు అయితే రోడ్డు కనిపించేది.ప్రమాదమూ జరిగి ఉండేది కాదు.రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరం సుమా.. ఇకనైనా మేల్కొండి.

రాత్రి ప్రమాదాలే ఎక్కువ..

ఉమ్మడి జిల్లాలో 100 కిలోమీటర్ల మేర 16వ నెంబరు జాతీయ రహదారి,60 కిలోమీటర్ల మేర 214 జాతీయ రహదారి ఉంది. కోనసీమ, ఏజెన్సీ ప్రాంతాల్లోను పలు రహదారులు ఉన్నాయి.



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లవద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ(ఫైల్)

జాతీయ రహదారులపై నిత్యం వేలాది లారీలు దేశంలో పలు రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలను అరికట్టేందుకు..ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు రోడ్లను రెండులైన్లు, నాలుగు లైన్లుగా వెడల్పు చేసినా ఏటా ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వీటిలో రాత్రి సమయంలో జరిగిన ప్రమాదాలే ఎక్కువ. వీటిలో నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదాలే ఎక్కువ. రాత్రివేళలో రోడ్లు ఖాళీగా ఉండడం, వేగంగా నడిపితే త్వరగా ఇంటికి వెళ్లిపోవచ్చనే కారణంగా ఎక్కువ కిలోమీటర్లు వాహనాలు నడిపి ఉండడం నిద్రవచ్చినా బలవంతంగా నిద్రను ఆపుకుని వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఒక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే గత 10నెలల కాలంలో వెయ్యి ప్రమాదాలు జరగ్గా 500 మందిపైనే మృత్యువాత పడ్డారు. నిద్రమత్తులో ప్రమాదం జరిగితే కనీసం బ్రేక్ కూడా వేసే అవకాశం ఉండదు కాబట్టి ఎక్కువ శాతం వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. కొందరు క్షతగాత్రులుగా మారి అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా మారి ఇంటికే పరిమితమవుతున్నారు.

నిబంధనలు గాలికి..

త్వరగా ఇళ్లు చేరుకోవాలనే కారణంతో నిద్ర ముంచుకొస్తున్నా చాలా మంది వాహనాలు నడుపుతారు. కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా లారీలను నిలుపుదల చేస్తారు. మరికొంత మంది నిషేధిత ప్రాంతాల్లో లారీలు నిలుపుదల చేస్తారు.అయినా పోలీసులు, రవాణాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎవరిది తప్పయినా నిద్రమత్తులో వాహనం నడిపేవారే ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేయకూడదు.వాహనాల నిలుపుదలకు ప్రత్యేకంగా నేషనల్ హైవే అథారిటీ స్థలాలు కేటాయిస్తోంది. కానీ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపివేస్తుంటారు. వీటిని నిద్రమత్తులో గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదాలకు ఎక్స్‌ప్రెస్ హై..వే

- అతివేగం.. నిద్రమత్తు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- జీవచ్ఛవాలుగా కుటుంబాలు
- పట్టని రాత్రి నిబంధనలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- వచ్చీరాని డ్రైవింగ్‌తో యాక్సిడెంట్లు
- 10 నెలల్లో వెయ్యి ప్రమాదాలు
- 500 మందిపైనే మృత్యువాత

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల నుంచి దివాన్‌చెరువు వరకు 55 కి.మీ ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవేపై రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారింది..అతివేగం కారణంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.గతేడాది హైదరాబాద్ నుంచి కుటుంబంతో కారులో బయలుదేరిన ఒక వ్యక్తి నల్లజర్ల వద్ద రోడ్డుపై ఆపిన లారీని గమనించకుండా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆత్రేయపురం మండలానికి చెందిన ఒక కుటుంబంలో నలుగురు మృత్యు వాతపడ్డారు. నవంబరు 3వ తేదీన కొవ్వూరు మండలం పంగిడి శివారు దేచర్ల వద్ద ఎక్స్‌ప్రెస్ హైవేపై కారు ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఒక వ్యాన్ యజమాని దానిమ్మకాయల లోడ్ వేసుకుని వేగంగా వస్తున్నాడు. నల్లజర్ల మండలం దూబచర్ల వద్ద వ్యాన్ టైర్ ప్యాచ్చీపడడంతో డివైడర్ దాటుకుని వెళ్లిన వ్యాన్ మరో లారీ ఢీకొట్టింది.. దీంతో ఆ వ్యాన్ యజమానికి కం డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇటీవల కొవ్వూరు వద్ద ఒక లారీ మరొక లారీని ఢీకొన్న ఘటనలో డ్రైవర్ కేబిన్‌కు వేలాడుతూ కనిపించిన ఘటన హృదయ విదారకంగా మారింది.ఈ రహదారిపై ఇటువంటి ప్రమాదాలు సర్వ సాధారణంగా మారిపోయాయి.



పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారులో మంగళవారం తెల్లవారుజామున పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. ఈ ఘటనలో తల్లీకుమారుడు మృతిచెందగా, మరో కుమారుడు గల్లంతయ్యారు



చీకట్లో ప్రయాణం.. చితికి తీసుకెళ్లింది!

10 కి.మీ రోడ్డు.. ప్రమాదకరం

పి.గన్నవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదం జీవితాలనే తారుమారు చేస్తుంది. అప్పటివరకు ఆనందంగా గడిపే కుటుంబాలు ఒక్క ఘోర ప్రమాదంతో విషాదంతో నిండిపోతాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజవరం-పొదలాడ రహదారిలో కొన్నేళ్లుగా జరు గుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.పి.గన్నవరం నుంచి గంటి వరకు 10 కిలో మీటర్లు మేర ఉన్న రహదారి చెంతనే ఉన్న ప్రధాన పంటకాల్వ ప్రమాదాలకు నిలయంగా మారింది.కొన్నేళ్లుగా ఇదే రహదారిలో జరుగుతున్న ప్రమాదాలు కొన్ని కుటుంబాలను చిన్నాభిన్నం చేశాయి.2017, నవంబరు 11న ఒక ఆటో కూలీలతో సహా పంట కాల్వలోకి దూసుకుపోతే పగటిపూట కావడంతో ఓ ప్రైవేటు ఉద్యోగితో పాటు స్థానికుల సాయంతో అందరూ బతికి బయట పడ్డారు.2022 డిసెంబరు 18న ద్విచక్ర వాహ నాన్ని భారీవాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక రు మృతిచెందారు. 2024, ఫిబ్రవరి 18న ఒక కుటుంబం కారుతో సహా పంటకాల్వలోకి దూసుకెళితే అటుగా వెళ్తున్న ఓ కానిస్టేబుల్ కాల్వలోకి దిగి ఆ కుటుంబాన్ని రక్షించాడు. 2024, మే 14న ధాన్యం లోడును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు.

అభివృద్ధికి మరో అడుగు!



- నేడు,రేపు కలెక్టర్లతో సీఎం మీటింగ్
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ప్లాన్
- జీవీఏలో జిల్లాకు 10వ స్థానం
- జనవరి నుంచి జన్మభూమి
- పలు అంశాలపై తీవ్రంగా చర్చ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి) సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లా స్థాయిలో నియోజకవర్గావారీ ఐదేళ్ల ప్రణాళికలు రూపొందించడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రాజధాని అమరావతిలో బుధవారం, గురువారం సీఎం నారా చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో పలు అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటి వరకూ జిల్లా ప్రగతి, జిల్లాలోని సమస్యలు, వాటి పరిష్కాలు, పథకాలు అమలు తీరు, అవసరాలు, వంటివాటిపై చర్చించడంతో పాటు భవిష్యత్‌లో చేయవలసిన పనులపై కూడా కూలంకషంగా చర్చించి నిర్ణయాలు తీసుకోకున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో ఉత్పత్తి విలువ మొత్తాన్ని జీవీఏ అంటారు. జీవీఏ నుంచి ఉత్పత్తి సబ్సిడీలను తీసి వేస్తే జీడీపీ వస్తుంది. మన జిల్లాకు సంబంధించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో గ్రాస్ వేల్యూ యాడెడ్ (జీవీఏ)లో జిల్లా 7వ స్థానంలో ఉంది. 18,740 కోట్లు జీవీఏ ఉంది. పరిశ్రమ రంగంలో జీవీఏ రూ.9,019 కోట్లు, రాష్ట్రస్థాయిలో జిల్లాకు 2.86 శాతం.ఇది 14వ స్థానం. సేవల రంగంలో జీవీఏ రూ.20,873 కోట్లు, ఇది 4.34 శాతం.8వ స్థానం. మొత్తం ఈ మూడు రంగాల జీవీఏ రూ.48,633 కోట్లు. రాష్ట్ర వాటాలో 3.97 శాతం. మొత్తం 10వ ర్యాంకులో ఉంది. జీడీపీ 2022- 23లో రూ.51,805 కోట్లుగా ఉండగా 2028-29 నాటికి 1,15,583కు పెరగనుంది. జిల్లాలో కొత్తగా పీఎంఏవై కింద అర్బన్ ప్రాంతంలో 3666, గ్రామీణ ప్రాంతంలో 3823 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టారు. వీటిని జనవరి 1 నుంచి మార్చి 31లోపు పూర్తిచేయనున్నారు.ఇప్పటికే జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం పై కలెక్టర్ పూర్తి మోనటరింగ్ చేసి సకాలంలో లక్ష్యాలు చేరేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం జిల్లాలో 1,69,908 మిస్సింగ్ కేసులు ఉండగా ఇప్పటి వరకూ 9906పై యాక్షన్ తీసుకున్నారు.ఇంకా 1,60,002 పరిశీలించాల్సి ఉంది. ఎన్‌పీసీఐకు సంబంధించి జిల్లాలో 2,29,375 మంది బ్యాంక్ ఖాతాలతో లింక్ కాలేదు.ఇంత వరకూ 2,24,154కు సంబంధించి చర్యలు తీసుకున్నారు. 5222 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో హౌస్ ఇమేజ్, జియో కోఆర్డినేషన్‌కు సంబంధించి జిల్లాలో 6,55,850 హౌస్ హోల్డ్స్ ఉండగా 6,25,964 పూర్తయ్యాయి. 29,909 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 95.44 శాతం పూర్తయింది.జిల్లాలో 49,189 మంది పిల్లలకు ఆధార్‌కార్డు గుర్తింపు లేనట్టు గుర్తించి 3707 మందిని ఇప్పటికే ఆధార్‌లో నమోదు చేయించారు. ఇంకా 45,482 నమోదు కావలసి ఉంది. జిల్లాలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 107 ఉండగా 104 సొసైటీలలో ఇప్పటికే రికార్డులన్నీ కంప్యూటరీకరించారు. ఇంకా మూడు కంప్యూటరీకరించవలసి ఉంది.

రెండు రోజులు చర్చించే అంశాలివే!

సీఎంతో జరిగే కలెక్టర్ల మీటింగ్‌లో పాల్గొనడానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ ఇప్పటికే అమరావతి వెళ్లారు. రెండు రోజుల పాటు కాన్ఫరెన్స్ జరగనుంది. మొదటి రోజు వ్యవసాయం, సహకారం, హార్టికల్చరల్, పశుసంవర్ధక, మ త్స్యఆక్వా, సివిల్ సప్లయిస్, ఫారెస్ట్, జలవ నరుల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, ఉపాధి హామీ పథకం,సెర్ప్, ఆర్ డబ్ల్యుఎస్,అర్బన్ డెవలపెంట్, శాంతిభద్ర తలపై సమీక్షిస్తారు. రెండో రోజు పరిశ్రమలు, ఐటి, విద్యుత్, టూరిజం, హెచ్ఆర్‌డీ,స్కిల్ డెవలప్‌మెంట్ హౌసింగ్, బీసీ, మైనార్టీ, విమె న్ వెల్ఫేర్, మైన్స్, ఎక్సయిజ్ వంటి వాటిపై సమీక్షిస్తారు. ముఖ్యంగా ఉచిత ఇసుక మీద చర్చించే అవకాశం ఉంది.జనవరి నుంచి జన్మ భూమి కార్యక్రమాన్ని మళ్లీ మొదలుపెట్టే అవకాశాలపై ప్రస్తావించనున్నట్టు సమాచారం.

జీజీహెచ్‌లో వైద్యసేవల పర్యవేక్షణకు

ఓఎస్‌డీ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ బోధనాసుపత్రి)లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పర్యవేక్షించడంతో పాటు వాటి వివరాలను ప్రభుత్వానికి నివేదించడానికి ప్రత్యేక అధికారిని నియమిస్తూ కలెక్టర్ ప్రశాంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కోనేరు రంగారావు కమిటీ (కేఆర్ఆర్‌సీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డిని జీజీహెచ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీస్ (ఓఎస్‌డీ)గా నియమించారు. కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో ఓఎస్‌డీ హోదాలో భాస్కర్‌రెడ్డి జీజీహెచ్‌ను వారంలో రెండు సార్లు సందర్శించాల్సి ఉంటుంది.

గంజాయి, సారా అరికట్టాలని

ఎస్పీకి ఎమ్మెల్యే వినతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా పెరిగిపోయిన గంజాయి ,సారా విక్రయాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ డి నరసింహకిశోర్‌ను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు ఎస్పీ నరసింహకిశోర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరం 46,47 డివిజన్లలో సారా, గంజాయి విక్రయాలు సాగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే దృష్టి పెట్టాలన్నారు. టీడీపీ నాయకులు యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, పెంటపాటి సుభాష్ పాల్గొన్నారు.

ఇష్టానుసారం..ఇసుక దోపిడీ

- నిబంధనలు మీరుతున్న నిర్వాహకులు
- 18 బోట్లు సీజ్..2 లారీలు పట్టివేత
- కేసుల నమోదుకు అధికారుల ఆదేశం



కొవ్వూరులో అధిక లోడ్ లారీని ఆపి సీజ్ చేస్తున్న ఆర్‌డీవో

రాజమహేంద్రవరం,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమాలు సాగుతూనే ఉన్నాయి. అధికారులు అదే స్థాయిలో స్పందిస్తున్నారు. సోమవారం కొవ్వూరు, రాజ మహేంద్రవరంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం చేపడుతున్న 18 బోట్లను అధికారులు సీజ్ చేశారు. బ్రిడ్జిల ప్రక్కన ఇసుక తీస్తున్నారనే కారణంతో కొవ్వూరులో 10, ధోబీఘాట్‌లో 8 బోట్లను అధికార్లను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయా బోటు యజమానులపై కేసులు నమోదు చేశారు.ఇదిలా ఉండగా కొవ్వూరు, తాళ్లపూడిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలను ఆర్‌డీవో రాణి సుస్మిత అడ్డుకుని సీజ్ చేశారు. తాళ్లపూడిలో యంత్రాన్ని సీజ్ చేశారు గాయత్రి ఇసుక ర్యాంపులలో మంగళవారం బోట్స్‌మన్ సొసైటీల ద్వారా తీసే ఇసుక తీత నిలిచిపోయింది. సొసైటీలకు కేటాయించిన ఇసుక తీత లక్ష్యాలు పూర్తి కావడంతో నిలిచిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంకా కొత్త కేటాయింపులు లేవు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సీఎం మీటింగ్‌కు వెళ్లడంతో ఇక్కడ ఎప్పుడు కేటాయింపులు జరుగుతాయనేదానిపై స్పష్టత లేదు. అప్పటి వరకూ ఇక్కడ ఇసుక తీత జరిగే అవకాశం లేదు.ఈలోపు కేటాయింపులు వస్తే ఇసుక తీత మొదలవుతోంది. బ్రిడ్జిల పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతున్నారనే కారణంతో సీజ్ చేసిన బోట్ల నిర్వాహకులపై అధికారులు క్రిమినల్ కేసు కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. తాము కేసు పెట్టామని అధికారులు చెబుతుంటే, ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పోలీసులు చెబుతున్నారు. ఇందులో రాజకీయనేతల ఒత్తిడి కూడా ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. ఇక ఇటీవల టెండర్లు పిలిచిన వంగలపూడి-1,2, ఓపెన్ ర్యాంపుల టెండర్లను రద్దు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.అక్కడ ఏకంగా టన్ను కేవలం రూ.11కే సరఫరా చేస్తానని టెండర్ వేశారు.మరో చోట కేవలం రూ.6 కే టన్ను ఇస్తానని టెండరు వేయడం గమనార్హం. ఇలా తక్కువ కోడ్ చేస్తూ టెండర్లు వేయడం అంటే ఇసుక దోపిడీకి ప్లాన్ చేసినట్టేననే కారణంతో టెండర్లను పెండింగ్‌లో పెట్టారు.

బోగస్ ఏరివే(ట)త


తుని మండలం రేఖవానిపాలెంలో తనిఖీ చేపడుతున్న పెద్దాపురం డీఎల్‌డీవో

పెద్దాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):

- అర్హత లేని పింఛన్‌దారుల ఏరివేతకు రంగం సిద్ధం
- క్షేత్రస్థాయిలో ఈనెల 9, 10తేదీల్లో పూర్తయిన సర్వే
- ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో పైలెట్ ప్రాజెక్ట్

బోగస్ పెంఛన్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది. అనర్హులను గుర్తించే సర్వే మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకో సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈనెల 9,10 తేదీల్లో ఆయా సచివాలయాల పరిధిలో బృందాలుగా ఏకకాలంలో సర్వే నిర్వహించారు. త్వరలో కొత్త పింఛన్ల మంజూరు వైపు అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం, వైసీపీ ఏలుబడిలో అనర్హులకు ఇబ్బడిముబ్బడిగా మంజూరైన బోగస్ పింఛన్లు ఏరివేయనుంది. కాకినాడ జిల్లాలో తుని మండలం రేఖవానిపాలెంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం గోడిలో, తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం తాడిమల్లలోని సచివాలయాల్లో ఈ సర్వే నిర్వహించారు.

పింఛన్ల అనర్హులపై రెండు నెలల క్రితమే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాలనాపరమైన పనుల ఒత్తిడి నేపథ్యంలో ప్రక్రియ వాయిదా వేస్తూ వచ్చింది. తాజాగా సంక్రాంతి కానుకగా అర్హులకు కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న సర్కారు ముందుగా బోగస్ ఏరివేతపై దృష్టిపెట్టింది. ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా కాకుండా జిల్లాకొక సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని సర్వే చేయిస్తోంది. సర్వే నివేదికను పరిశీలించి గ్రామసభ నిర్వహించి సర్వేలో వెల్లడైన బోగస్ పింఛన్ల వివరాలను తెలియచేసి అందరి ఆమోదంతో వాటిని రద్దు చేయాలని భావిస్తోంది.

అర్హులకు దక్కనందుకే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి అధికార పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి చేసి అనర్హులకు పింఛన్లు మంజూరు చేయించారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారుల పేరుతో ఎక్కువగా అర్హత లేని పింఛన్‌దారులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అదే సమయంలో రాజకీయ కారణాలవల్ల పింఛన్లు పొందని అర్హులు కూడా భారీ సంఖ్యలో ఉన్నట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో బోగస్‌పై పూర్తిస్థాయిలో దృష్టిసారించింది. తాజా సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని సూచించింది.

బయట పడనున్న అక్రమాలు

ఆధార్‌కార్డులో వయసుపెంచి వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న వారు, వైద్యులను మేనేజ్ చేసి సదరం సర్టిఫికెట్లు పొందినవారు, భర్త ఉన్నా ఒంటరి మహిళ ధ్రువపత్రాలు పొందినవారు, కళల ముఖం చూడని డప్పు, వాయిద్య కళాకారులపై సర్వే అధికారులు దృష్టిసారించనున్నారు. సదరు సచివాలయ పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన అర్హుల వివరాలను కూడా పనిలో పనిగా సేకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తం సర్వే నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తారు. పైలట్ సర్వే ఫలితాన్ని బట్టి ప్రభుత్వం పింఛన్లపై ముందుకు వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. 50ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పింఛన్లు మంజూరు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దీన్ని కూడా అమలు చేయాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

మొత్తంమీద ప్రభుత్వ తాజా నిర్ణయం బోగస్ లబ్ధిదారుల్లో వణుకు పుట్టిస్తుండగా అర్హుల్లో మాత్రం ఆనందం వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా సమగ్ర సర్వే

జిల్లాకు ఒక సచివాలయ పరిధిలో సర్వే నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కాకినాడ జిల్లాలో తుని మండలం రేఖవానిపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేశారు. రెండురోజులపాటు ఆయా సచివాలయ పరిధిలో సమగ్ర సర్వే నిర్వహించారు. పారదర్శకత కోసం పొరుగు మండలానికి చెందిన అధికారులు ఉద్యోగులతో సర్వే చేపడుతున్నారు.

కేవీస్వీ ప్రసాద్, డీఎల్‌డీవో

కొత్తగా.. రెక్కలొచ్చెనా..!



కొత్తగా రెక్కలొచ్చినట్టుగా.. కొంగలు పంట పొలాల్లో పురుగులకోసం వెతుకులాట చేస్తూ.. అలా ఒక్కసారిగా ఎగిరిపోసాగాయి. కాకినాడ జిల్లా అన్నవరం హైవే పక్కన పొలాల్లో కొంగలు కనువిందు చేసిన ఈ చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

ఫొటోలు: కాకినాడ ఫొటోగ్రాఫర్/ఆంధ్రజ్యోతి



ఇంటర్ విద్యార్థులకూ...
ప్రోగ్రెస్ కార్డులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ నూతన విధానంతో విద్యార్థులు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, వారి ప్రగతి తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా మంచి ఫలితాల సాధనకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చర్యలు
- తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు
- ఈ ఏడాది నుంచే అమలు



సామర్లకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, అంతర్గత పరీక్షల్లో వారు సాధించిన మార్కుల వివరాలను సదరు కార్డుల్లో నమోదు చేయనున్నారు. తల్లి తండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ పరీక్షలు, త్రైమాసికం, అర్ధసంవత్సరం, ప్రీఫైనల్ పరీక్షలు రెండుసార్లు నిర్వహిస్తారు. వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెలుపు, జనరల్ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులకు లేతపసుపు, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు లేతనీలం రంగుల్లో కార్డులు సిద్ధం చేస్తున్నారు. హాజరు వివరాలు నమోదు చేయనుండడంతో విద్యార్థులు సక్రమంగా కళాశాలలకు వెళుతున్నారా, లేదా అనే విషయాలు తల్లితండ్రులకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కార్డుల నమూనాలను అధికారులు జూనియర్ కళాశాలలకు పంపించారు. వీటిని అమలు చేయాల్సిన తీరుపై ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డుల గురించి తెలియజేస్తూ వీటిని తప్పక అనుసరించాలని సూచనలు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో145 కళాశాలల్లో 44,408 మంది విద్యార్థులు

తూర్పు గోదావరి జిల్లాలో ఆర్‌ఐవో పరిధిలో ప్రభుత్వం, ఎయిడెడ్, మోడల్, ఏపీఎస్‌డబ్ల్యుఆర్, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థలకు చెంది 145 కళాశాలలు ఉన్నాయి. వీటిలో సీనియర్ ఇంటర్‌కు చెంది 20,878 మంది విద్యార్థులు, జూనియర్ ఇంటర్‌కు చెంది 23,530 మంది విద్యార్థులు.. మొత్తం 44,408 మంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకే..

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోగ్రెస్ విధానం ఎంతో దోహదం చేస్తుంది. ఈ ఏడాది నిర్వహించే ప్రతి పరీక్షకూ సంబంధించిన వివరాలు, హాజరు శాతం, ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపిస్తారు. దీంతో విద్యార్థుల వివరాలు, వారి పరిస్థితి అధ్యాపకులకు ముందుగానే తెలుస్తాయి. దీని ఆధారంగా వారిని బాగా చదివించి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు కృషి చేస్తాం.

- ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం, ఆర్‌ఐవో (ఇంటర్ విద్య)

ఏజెన్సీలో వెదురు ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు

రంపచోడవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వెయ్యి ఎకరాల్లో వెదురు ప్లాంటేషన్ ఏర్పాటు చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ఐఎసీబీ కన్సల్టెంట్ సత్యప్రసన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయనతో పాటు సబ్ కలెక్టర్ కల్పశ్రీ హాజరయ్యారు. గిరిజన రైతులు అటవీ హక్కులు పొందిన భూముల్లో వెదురు ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సబ్ డీఎఫ్‌వోలు అనూష, శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, బాలాజీ, ఎఫ్‌ఆర్‌వోలు షరీఫ్, ఏడుకొండలు, బి.ఏడుకొండలరావు, పి.శ్రీనివాసరావు, నానాజీ, ఐఎస్‌బీ జిల్లా కో-ఆర్డినేటర్ జె.నానిబాబు పాల్గొన్నారు.

నా బాధ్యత పెరిగింది

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా ...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి



ఇంటర్వ్యూ..

సీపీఎస్ రద్దు కోసం సైకిల్ యాత్ర చేపట్టినా, శ్రీకాకుళం నుంచి అమరావతి వరకు బస్సుయాత్ర నిర్వహించినా ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగకుండా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు గోపిమూర్తి. ఈనెల 5వ తేదీన జరిగిన తూర్పు పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో యూటీఎఫ్ బలపరిచిన బొర్రా గోపిమూర్తి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చరిత్రలోనే అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిచాడు. సోమవారం నాడు కాకినాడలో నిర్వహించిన కౌంటింగ్‌లో ఆయన సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 5259 ఓట్లు రాగా, గోపిమూర్తికి 9165 మొదటి ప్రాధాన్యత ఓట్లుతో గెలుపొందారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బొర్రా గోపిమూర్తితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ...

- నిడమర్రు

ప్రశ్న: మీ ఉపాధ్యాయ జీవితం ఎప్పుడు ప్రారంభమైంది ?

1998 ఆగస్టు 19న ఆచంట మండలం బోగలాపురంలో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభమైంది.

ప్ర: యూటీఎఫ్‌లో ఎలాంటి పాత్ర పోషించారు ?

నా ఉద్యోగ జీవితంతో పాటు ఉపాధ్యాయ ఉద్యమాల పట్ల ఎక్కువగా ఆకర్షితుడయ్యాను. యూటీఎఫ్ కార్యకర్తగా పనిచేయడం నాకు ఎనలేని గుర్తింపునిచ్చింది. ఉపాధ్యాయ సమస్యల కోసం సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నాశక్తి మేరకు పనిచేశాను. ముఖ్యంగా మా నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ దివంగత షేక్ సాబ్జీతో పని చేసిన పోరాటాలు, ఉద్యమాలు నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఉద్యోగం జీవితంలో నేను పాల్గొన్న అసెంబ్లీ ముట్టడి, సి.ఎం క్యాంపుఆఫీసు ముట్టడి, విజయవాడ ధర్నా వంటి ఉద్యమాలను, పోరాటాలను గుర్తుంచుకొని యూటీఎఫ్, మిత్ర సంఘాల నాయకులు, కార్యకర్తలు నా విజయం కోసం పగలు, రాత్రి ఎంతో కష్టపడ్డారు.

ప్ర: ఎమ్మెల్సీగా ఎన్నికైన మీ లక్ష్యం ఏమిటి?

ఉపాధ్యాయ సంఘ నేతగా కన్నా ఇప్పుడు ఎమ్మెల్సీగా నా బాధ్యత మరింత పెరిగింది. శాస నమండలి సమావేశాలలో, రాష్ట్ర సచివాలయ సమావేశాలలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమ స్యల కోసం నిరంతరం పనిచేస్తా. ఉపాధ్యా యులు, ఉద్యోగులు, అప్రెంటీస్ ఉద్యోగులు, కాం ట్రాక్టు ఉద్యోగులు, సీఆర్‌పీల సమస్యల కోసం కృషి చేస్తాను.

ప్ర: ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం కోసం ఏం చేస్తారు. ?

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌ల భారం, ఎండీఎం నిర్వహణ భారం, నిత్యం ఆన్‌లైన్ వర్క్‌లతో బోధన సన్నగిల్లుతోంది. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలపడాలంటే అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలి. ఉపాధ్యాయులను బోధనకు ఉపయోగించి మిగిలిన పనుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి పాఠశాలకు రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఆయా వంటి ఉద్యోగులను నియమించడం ద్వారా ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో బోధనపై దృష్టి పెట్టడం జరుగుతుంది. తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయి.

ప్ర: ఉపాధ్యాయులకు మీరిచ్చే సందేశం ?

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పనిచేయడమే లక్ష్యం. నాకు మద్దతునిచ్చిన ప్రతి ఒక్క సంఘానికి, నాయకులకు, కార్యకర్తలకు, నాకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మా యూటీఎఫ్ ఉద్యమ నేత షేక్ సాబ్జీ అడుగుజాడలలో నడస్తూ అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.



చవకగా సెకండ్ హ్యాండ్

తక్కువ ధరకు బైక్‌లు లభించే గ్రామంగా పేరు

పాత బైక్‌ల అమ్మకాలకు కేరాఫ్ సుబ్బయ్యమ్మపేట

సెకండ్ హ్యాండ్ మోటారుసైకిల్ కొనాలనుకుంటున్నారా? ధర కూడా తక్కువగా ఉండాలనుకుంటున్నారా? అయితే ఆ గ్రామం వెళ్లాల్సిందే. ఈమధ్య కాలంలో సెకండ్ హ్యాండ్ మోటార్ సైకిళ్ల విక్రయాల పేరు చెప్తే ఉమ్మడి జిల్లాలోనే ఆగ్రామం పేరు వినిపిస్తోంది. ఊరికి పల్లెటూరు అయినా వందలాది బైక్‌లు అమ్మకానికి సిద్ధంగా ఉంటున్నాయి. ఇలా సెకండ్స్ అమ్మకాలకు చిరునామాగా నిలుస్తున్న గ్రామం పేరు సుబ్బయ్యమ్మపేట.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఉన్న ఈ గ్రామంలో బయటి రాష్ట్రాలనుంచి భారీస్థాయిలో వాహనాలను తీసుకొస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం సహా పలు పట్టణాలకు హోల్‌సేల్‌గా ఇక్కడినుంచి సరఫరా చేస్తున్నారు.

● గండేపల్లి

తక్కువ ధరలోనే లభ్యం

గండేపల్లి మండలంలోని హైవేకు రెండు కిలోమీటర్లన్నర లోపల ఉన్న చిన్న పల్లెటూరు ఈ సుబ్బయ్యమ్మపేట. గ్రామంలో సెకండ్ హాండ్ మోటార్‌సైకిళ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. రూ.10వేల నుంచి మోటారు సైకిళ్లు దొరుకుతున్నాయి. మోటారుసైకిళ్లను పక్క రాష్ట్రాలనుంచి వేలంపాటలో దక్కించుకుని కంటెయినర్లలో ఇక్కడికి తీసుకువస్తున్నారు. ఇక్కడ వాటికి వాటర్ సర్వీసింగ్, డేమేజ్ పాలిష్ లాంటి అన్ని రకాల హంగులు దిద్ది వాటిని ముస్తాబు చేస్తారు. ఆ తర్వాత విక్రయాలు చేపడుతున్నారు. జగ్గంపేట, రాజమండ్రి, కాకినాడలో ఉండే సెకండ్ హాండ్ షోరూమ్ వాళ్లు కూడా ఇక్కడ నుంచే మోటారు సైకిళ్లు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. సుబ్బయ్యమ్మపేటలో తక్కువ ధరకు మోటారుసైకిళ్లు లభ్యమవుతుండడంతో ఇక్కడికే వచ్చి మోటారు సైకిళ్లు కొనుక్కుంటున్నారు. ఇలా ఈ గ్రామం పేరు ఇప్పుడు పాత బైక్‌ల కొనుగోళ్లకు మారుమోగుతోంది..సుదూర ప్రాంతాల నుంచి సైతం వస్తున్నారు.

రాష్ట్ర విభజన అంశం తేల్చండి

పార్లమెంట్‌లో చర్చకు నోటీసు ఇప్పించండి

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మాజీ ఎంపీ ఉండవల్లి లేఖ

రాజమహేంద్రవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ ఉభయ సభల్లోనూ విభజన జరిగిన తీరు.. తద్వారా మనకు జరిగిన అన్యాయం గురించి మీరే శ్రద్ధ తీసుకుని పార్లమెంట్‌లో చర్చకు నోటీసు ఇప్పించాలని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ లేఖరాశారు.ఈ లేఖ ప్రతిని మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేశారు.ఆ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని త్వరగా ఒక కొలిక్కి తీసుకుని రావాలని కోరారు. నేను సుప్రీంకోర్టు దాఖలు చేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉంది. కేంద్రం ఇప్పటిదాకా కనీసం కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. 2018 ఫిబ్రవరి 18న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రూ.74,542 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయని తేల్చిందన్నారు. అదే ఏడాది జూలై 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లోక్‌సభలో జరిగిన అఘాయిత్యం గురించి వివరించానని, తాను చూపిన రికార్డులను పరిశీలించి ఆయన తన వాదనతో ఏకీభవించి చర్చకు నోటీసు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో రాష్ట్రం తరపున అఫిడవిట్ దాఖలు చేయాలని నిర్ణయించారని, కారణాలేమిటో కానీ అవి అమలు కాలేదన్నారు. 2019 జనవరి 29న తాను విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి వైసీపీ తప్ప ముఖ్యపార్టీల నేతలంతా హాజరయ్యారని దానికి జనసేన పార్టీ అధ్యక్షుడిగా మీరు హాజరుకావడంతో సమావేశం ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. అప్పట్లో మనం 2019 ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా మనకు జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని తీర్మానం చేసినట్టు ఆయన పవన్‌కల్యాణ్‌కు గుర్తు చేశారు. కానీ ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన జగన్‌కి చంద్రబాబుకు రాసినట్టే లేఖ రాశానని, కనీసం ఆయన కార్యాలయం నుంచి సమాధానం రాలేదన్నారు. కానీ 2022 నవంబరు 28న సుప్రీంకోర్టులో సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ ఇన్నేళ్ల తర్వాత ఈ కేసును విచారిస్తే తేనెతుట్టను కలిదించినట్టేనని.. అందువల్ల కేసు మూసివేయాలన్నారు. ఏపీ తరఫున హాజరైన న్యాయవాది చేసిన ఈ వాదన తనతో పాటు, అక్కడ ఉన్న తెలుగు న్యాయవాదులందరికీ విస్మయం కలిగించిందని వాపోయారు. 2023 ఫిబ్రవరి 23న అప్పటి ఏపీ ప్రభుత్వం నా వాదనను బలపరుస్తూ కౌంటర్ దాఖలు చేసిందన్నారు. దేశప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా కూడా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిన తీరు గురించి పార్లమెంట్‌లో పలుసార్లు ప్రస్తావించారని, కానీ అప్పటి మన ఎంపీలు వాటిపై చర్చ కోరలేదన్నారు. ఇవాళ మీరిద్దరూ బీజేపీతో కలసి రాష్ట్రం, కేంద్రంలోనూ అధికారంలోకి రావడం, విభజన సమయంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణలో, సహకరించిన బీజేపీ కేంద్రంలోనూ అధికారంలో ఉండడం మన రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టు కోవడానికి, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇదే సరైన సమయమని ఆ లేఖలో స్పష్టం చేశారు.

'తూర్పు' నుంచి మరింత మంది
న్యాయమూర్తులను అందించాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నుంచి భవిష్యత్తులో మరింత మంది న్యాయమూర్తులు రావాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆకాంక్షించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం అదనపు సెషన్స్ కోర్టును వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ఠాకూర్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పంటలు, ధాన్యాలు అందించే ప్రాంతమే కాకుండా హైకోర్టులో ఐదుగురు న్యాయమూర్తుల భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. రామచంద్రపురంలో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటుతో 700 పైగా కేసులు రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం బదిలీ అయ్యాయన్నారు. రామచంద్రపురంలో 250 మంది న్యాయవాదులు పనిచేయడం సంతోషకరమన్నారు.

న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మాట్లాడుతూ జిల్లా కోర్టు ఏర్పాటు ద్వారా జూనియర్ న్యాయవాదులకు పునాది పడిందన్నారు. జిల్లా జడ్జి గంధం సునీత మాట్లాడుతూ దశాబ్దాలుగా జిల్లా కోర్టు ఏర్పాటుకు న్యాయవాదులు చేసిన కృషి నేటితో ఫలించిందన్నారు. న్యాయవాదులు ఐకమత్యంగా ఉండి న్యాయం అందించాలన్నారు. జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి హరినారాయణ ముగింపు సందేశం అందించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్‌కు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి కృతజ్ఞతలు తెలిపారు.

అలిసిన ప్రయాణం... ఆయువు తీసింది!

విహారయాత్ర విషాదాంతమైంది. చిమ్మ చీకటి ఆపై 'అలిసి'న ప్రయాణం శాపంగా మారి ఆయువు తీసింది.. చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగించే భార్యాభర్తలు, చక్కనైన ఇద్దరు కుమారులు..హాయిగా సాగిపోతున్న ఆ కుటుంబ ప్రయాణం మంగళవారం తెల్లవారుజామున కుదుపులకు గురైంది. భార్య, ఇద్దరు పిల్లలను పోగొట్టుకుని ఓ వ్యక్తి ఒంటరిగా మిగిలాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటలో మంగళవారం తెల్లవారుజామున ప్రధాన పంట కాల్వలోకి కారు దూసుకుపోయిన సంఘటన ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.

- తెల్లవారేదాకా ఆగితే ప్రాణాలు మిగిలేవి
- పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు ప్రమాదంలో భార్య, కుమారుడిని పోగొట్టుకుని ఒంటరైన వ్యక్తి
- కుటుంబం కన్నీరుమున్నీరు
- పి.గన్నవరం మండలం పోతవరంలో విషాదఛాయలు


సంఘటనా స్థలంలో భార్య, కుమారుడి మృతదేహాల వద్ద విలపిస్తున్న విజయ్‌కుమార్

పి.గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్‌కుమార్ భార్య ఉమా (32), కుమారుడు రోహిత్(9) కారు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. మనోజ్ (5) అనే మరో కుమారుడు కాల్వలో గల్లంతయ్యాడు. కేవలం 5 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే వారు గమ్య స్థానానికి వెళ్లిపోయేవారు. ఇదంతా పదిహేను నిమిషాల ప్రయాణం అంతే..కానీ మృత్యువు వారిని క్షేమంగా ఇంటికి చేరనీయలేదు. చిమ్మ చీకటి, ఆపై మంచు ఈ సమయంలో రోడ్డు ప్రయాణం ఎంత ప్రమాదమో ఈ ఘటన చాటిచెప్పింది.

చక్కని కుటుంబం..హాయిగా సాగే జీవితం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్ కుమార్ బీఎస్సీ బీఈడీ చదివాడు. కొవిడ్ ముందు వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో పాఠాలు చెప్పుకుని జీవనం సాగించేవాడు. లాక్‌డౌన్ ప్రభావంతో వచ్చిన ఇబ్బందులతో ఉద్యోగం మానేసి ఓ కారు కొనుగోలు చేసి స్థానికులకు డ్రైవింగ్ నేర్పుతూ, మధ్య మధ్యలో కిరాయిలకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విజయ్‌కుమార్ భార్య ఉమాకు కూడా డ్రైవింగ్ రావడంతో ఆమె కూడా మహిళలకు డ్రైవింగ్ నేర్పుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. వారికి రోహిత్ (మూడో తరగతి), మనోజ్ (యూకేజీ) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవింగ్ నేర్పుతూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో ఈ కుటుంబం ఆనందంగా జీవిస్తోంది. కష్టపడి పనిచేసుకోవడం కొన్ని డబ్బులు దాచుకుని కుటుంబం అంతా కలిసి బయటకు వెళ్లడం ఇలా సాగుతోంది వారి జీవిత ప్రయాణం..కానీ ఒక్క ప్రమాదం ఆనందకరమైన కుటుంబంలో విషాదాన్ని నింపింది. తేరుకోలేనంతగా దెబ్బతీసింది. విజయ్‌కుమార్ వైజాగ్ నుంచి నిరంతరాయంగా కారు నడుపుతూ రావడం వల్ల అలసిపోయి ఈతకోట దగ్గర ఆగిపోయాడు. అలా వారు తెల్లవారే దాకా అక్కడే ఉండి కారులో విశ్రాంతి తీసుకున్నా, ఈతకోటలో ఉన్న తమ బంధువులు ఇంటికెళ్లినా ప్రాణాలు మిగిలేవని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొడుకు కుటుంబం చిన్నాభిన్నం కావడంతో విజయ్‌కుమార్ తల్లిదండ్రులు వీరవెంకట సత్యనారాయణ, లక్ష్మి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


విహారయాత్రలో విజయ్‌కుమార్ కుటుంబం(ఫైల్)


పోతవరం విజయ్‌కుమార్ నివాసంలో కోడలు, మనవళ్ల కోసం రోదిస్తున్న వీరవెంకటసత్యనారాయణ, లక్ష్మి దంపతులు

బతికే అవకాశం వచ్చి..చేజారి..

కారు పంట కాల్వలోకి దూసుకెళ్లిన తర్వాత విజయ్‌కుమార్ వెంటనే తేరుకుని వెనుక డోర్‌ను ఓపెన్ చేసి బయటకు వచ్చాడు. ఆ సమయంలో భార్య ఉమా, ఓ కుమారుడిని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చాడు. మరో కుమారుడు కోసం మళ్లీ నీటిలోకి వెళ్లాడు. అయితే ఇక్కడ కూడా అతడికి విధి సహకరించలేదు. ఒడ్డుకు చేరిన భార్య, కుమారుడు ఆ చిమ్మ చీకట్లో తెలియక కాలుజారి మళ్లీ అదే కాలువలో మునిగిపోవడం అత్యంత విషాదం. కుటుంబం మొత్తం నీటిలో మునిగిపోవడం, సాయం చేయడానికి ఒక్కరూ లేకపోవడం అయినా తానొక్కడే ఆ చీకట్లో నీటిలో రక్షించే ప్రయత్నం చేయడం.. కొన్ని నిమిషాల పాటు విజయ్‌కుమార్ భరించిన బాధ వర్ణనాతీతం.. ఈ ఘటనతో అతను షాక్‌కు గురయ్యాడు. ఒడ్డుకు చేర్చింది చిన్న కుమారుడో, పెద్ద కుమారుడో కూడా అతను చెప్పలేకపోయాడు. మరోవైపు భార్య, కుమారుడు మృతదేహాల వద్ద విజయ్‌కుమార్ రోదించిన తీరు కలచివేసింది.

చాలా బాధాకరం : ఎమ్మెల్యే గిడ్డి

చింతావారిపేట వద్ద జరిగిన ఘటన చాలా బాధాకరమైనదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రమాద ఘటన వివరాలను విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహాయక చర్యలను పర్యవేక్షించారు.

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పూర్తిచేయండి

కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు రాష్ట్ర టీడీపీ ఎంపీల బృందం వినతి


ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు బొకే అందజేస్తున్న ఎంపీల బృందం

అమలాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల్లో అత్యంత ప్రధానమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టాలని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్‌మాధుర్‌తో పాటు ఏపీకి చెందిన ఎంపీల బృందం మంగళవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను అభ్యర్థించింది. ఎంపీ హరీష్‌తో పాటు టీడీపీ పార్లమెంటరీ పక్షనేత లావు శ్రీకృష్ణదేవరాయులు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్లమెంటు సభ్యులు కలిశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు. ఈ సందర్భంగా కోనసీమ జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టాలని కోరారు. భట్నవిల్లి వరకు ఫేజ్-1 భూసేకరణ పూర్తి అయిందని, రెండో దశలో భాగంగా వంతెనల నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా సేకరించారని, ఈ పంట సాగు తరువాత ఆ భూమిని స్వాధీనం చేసుకుని రైల్వే శాఖకు అప్పగిస్తామని తెలిపారు. భట్నవిల్లి అమలాపురం పట్టణానికి సమీపంలో ఉన్న దృష్ట్యా ప్రయాణికులు, సరుకు రవాణాకు ఎంతో అనుకూలంగా ఉంటుందని, కోటిపల్లి నుంచి భట్నవిల్లి వరకు అనుసంధానంచేసి వీలైనంత వరకు ట్రాక్‌ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని కోరారు. దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరకాల కోరిక అయిన ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించేందుకు కృషి చేయాలని, అమలాపురంలో గతంలో ఏర్పాటుచేసి తొలగించిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని.. ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో ఉదయ్, కోణార్క్, జన్మభూమి రైళ్లకు హాల్ట్ సౌకర్యం పెంచాలని ఎంపీ హరీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రం ఎంపీలతో కలిసి వినతిపత్రాన్ని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు అందజేసినట్టు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన సానా సతీష్

కాకినాడ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కూటమి రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకుగాను టీడీపీ అధిష్ఠానం విడుదల చేసిన జాబితాలో తనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల సతీష్ ఆనందం వ్యక్తం చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం సీఎం చంద్రబాబును కలిశారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సానా సతీష్

విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధించాలి

ఆర్‌జేడీ నాగమణి


శిక్షణ జరుగుతున్న తీరును తెలుసుకుంటున్న ఆర్‌జేడీ

దివాన్‌చెరువు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధించినప్పుడే విద్యార్థుల అభ్యాసనా స్థాయి పెరుగుతుందని ప్రాంతీయ విద్య సంచాలకులు(ఆర్‌జేడీ) జి.నాగమణి అన్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధించాలని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కొండగుంటూరులోని ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఒకటో తరగతి విద్య పునాదిగా ఉంటుందని చెప్పారు. విద్యార్థికి భాష, గణితంలో అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓర్పు, సహనం ఆభరణాలుగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో నమ్మకం కలిగించేలా విద్యాబోధన చేయాలని, అప్పుడే ప్రాథమిక పాఠశాలలు పూర్వవైభవం పొందుతాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌రోల్‌మెంట్ ఆందోళనకరంగా ఉందని, ఈ విషయాన్ని ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి ముందే ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. శిక్షణా కేంద్రం నిర్వహిస్తున్న తీరును కోఆర్డినేటర్ పి.రాంబాబు ఆర్‌జేడీకి వివరించారు. అకడమిక్ పరంగా ఉపాధ్యాయులకు అందుతున్న కంటెంట్‌పై కేఆర్పీలు, డీఆర్పీలను ఆమె అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో కలసి శిక్షణాకేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్‌జేడీ రుచి చూశారు. సమావేశంలో డైట్ లెక్చరర్ సుజాతరత్నం, ఎంఈవో సీహెచ్‌వీ సోమిరెడ్డి, ప్రథమ్ రాష్ట్ర పరిశీలకురాలు ధనిమిరెడ్డి గీతారమ్య ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వంశీకృష్ణ, వి.నాగేశ్వరి, కీరిసోర్స్ పర్సన్స్ ఈశ్వర్, కొండలరావు, గౌతమ్ కృష్ణ, డీఆర్పీలు పాల్గొన్నారు. అలాగే శిక్షణా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సందర్శించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని, నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృత్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు.

ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారిని అంటూ ఫేక్ కాల్స్

గొల్లప్రోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మేము ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంటు నుంచి మాట్లాడుతున్నాం. మీ షాప్‌ను చెక్ చేయాలి, రాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటూ కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని పలు షాపుల నిర్వాహకులకు మంగళవారం ఫోన్‌కాల్స్ వచ్చాయి. అవి ఫేక్ కాల్స్‌గా గుర్తించిన వారు తమ షాపుల వద్దకు రావాలని సూచించడంతో మా అధికారులు వచ్చి మీ సంగతి చూస్తారంటూ ఫోన్ కట్ చేశారు. పట్టణంలోని శ్రీనివాస ఏజెన్సీస్ అధినేత కేదారశెట్టి నానాజీకి మంగళవారం 6301937852 నుంచి ఫోన్‌కాల్ వచ్చి ఇదే విధంగా ఫోన్‌కాల్ రాగా వచ్చింది. బెదిరింపు ధోరణిలో మాట్లాడి ఫోన్ పెట్టేశాడని నానాజీ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

ఫొటోలు తీస్తున్నాడన్న కోపంతో... స్తంభానికి కట్టి కొట్టారు

నలుగురిపై కేసు నమోదు


యువకుడిని స్తంభానికి కట్టేసిన దృశ్యం

ఉప్పలగుప్తం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువుల వద్ద ఫొటోలు తీస్తున్నాడన్న కోపంతో కొందరు ఒక యువకుడిని స్తంభానికి కట్టి కొట్టారు. ప్రస్తుతం బాధితుడు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో కొంతకాలంగా ఆక్వా సాగుకు వ్యతిరేకంగా కొందరు యువకులు ఆందోళన చేస్తున్నారు. హైకోర్టును ఆశ్రయించి రొయ్యల చెరువులను మూసివేయించారు. తాజాగా సోమవారం సాయంత్రం రొయ్యల సాగు తిరిగి ప్రారంభిస్తున్నారని తెలుసుకున్న గ్రామానికి చెందిన చిక్కం వీరదుర్గాప్రసాద్ ఆ ప్రాంతానికి వెళ్లి ఫొటోలు తీసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహించిన రైతులు అతడిని స్తంభానికి కట్టి కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిక్కం గాంధి, గనిశెట్టి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, వెంకట్రాజుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

పులి కోసం గాలింపు

ప్రత్తిపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో పెద్ద పులి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరంగా జరుగుతుంది. మంగళవారం కూడా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కిత్తమూరుపేట బీట్ సెక్షన్ సిబ్బంది అటవీప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పులి జాడ మాత్రం మంగళవారం రాత్రికి కూడా అటవీ సిబ్బందికి లభించలేదు. 6 ట్రాప్ కెమెరాలు బురదకోట పరిసర అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసినప్పటికీ పెద్దపులి ఆచూకీలభించలేదు. దీంతో పులి జాడ తెలుసుకునేందుకు చేపట్టాల్సిన అంశాలపై రేంజర్ దుర్గాప్రసాద్ సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మరో వ్యక్తికి తీవ్రగాయాలు


మరణించిన అత్తి సూరిబాబు

తుని రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 16వ నెంబరు జాతీయ రహదారిపై ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు పాత ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో అత్తి సూరిబాబు అక్కడికక్కడే మరణించగా మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చున్న సింధిరపు అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. తుని రూరల్ ఎస్ఐ బి.కృష్ణమాచారి తెలిపిన వివరాల ప్రకారం.. సూరిబాబు ప్రత్తిపాడుకు చెందినవాడు. అనిల్‌తో కలిసి తునిలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వారిని ఢీకొంది. అనిల్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

10 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు సమీపంలో ఒక ఆటోలో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం కోలమూరు సమీపంలో ఓ ఆటోను తనిఖీ చేయగా 10 కిలోల గంజాయిని గుర్తించామని, గంజాయి తరలిస్తున్న కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సింగిడి రామ్ మణికంఠవంశీ, ఏలూరు జిల్లా రావికంపాడు గ్రామ సమీపంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన పెండెం వేణులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

కారు దగ్ధం

చింతూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సరివెల సమీపంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు కారును దగ్ధం చేశారు. విజయవాడ జగదల్‌పూర్ జాతీయ రహదారి మీదుగా జైలో కారు భద్రాచలం వైపు వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. కాగా కారుకు చెందిన వ్యక్తులు ఎవ్వరూ కూడా పోలీసులను సంప్రదించలేదు. దీంతో కారు దగ్ధంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈనెల 8తో మావోయిస్టుల వారోత్సవాలు ముగిశాయి. కాగా 9న తెలంగాణ బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో రాత్రి సమయంలో చింతూరు మీదుగా రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఇది మావోయిస్టుల పనా లేదా సాంకేతిక కారణమా అనే విషయం స్పష్టం కావాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సరివెల సమీపంలో దగ్ధమైన కారు

మహాసంస్థానంలో... వైభవంగా సహస్ర చామంతి అర్చన


ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు

పిఠాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సహస్ర చామంతి అర్చన నిర్వహించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు పుష్పాలతో విశేష అలంకారం చేశారు. ఉదయం మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్ఠానము, సాయంత్ర అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్రహోమం, వివిధ హారతులు, స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాదగయలో సహస్ర తామర పుష్పార్చన

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు సహస్ర తామర పుష్పార్చన నిర్వహించారు. అనంతరం పుష్పాలతో దత్తాత్రేయస్వామిని అలంకరించారు. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాదులు, మంగళహారతి నిర్వహించారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు రెండోరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరుమంగయై ఆళ్వార్‌ను పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాలు మంగళవాయిద్యాలతో ప్రకారోత్సవం, ద్రవిడ వేద పారాయణం, నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేపట్టారు.


ప్రత్యేక అలంకరణలో ఆళ్వార్

వెంకన్న ఆదాయం రూ.2.09లక్షలు

వాడపల్లిలో వేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.2,09,534 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో తెలిపారు.


పల్లకీ మహోత్సవ దృశ్యం

మధురానగర్‌లో చోరీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ 48వ డివిజన్ పరిధిలో గల గోకులం మధురానగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. నండూరి వెంకటరాఘవాచార్యులు, ఆండాళ్లమ్మలు భార్యాభర్తలు. ఈనెల 3న హైదరాబాద్‌లో జరిగే బంధువుల షష్టిపూర్తి మహోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లారు. మంగళవారం ఉదయం మధురానగర్‌లో ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన తలుపు తీసుకుని ఉండడాన్ని గమనించారు. బీరువాలో ఉన్న సుమారు 2 కాసుల బంగారం, కిలో వెండి చోరీకి గురైనట్లు గుర్తించి తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశామని ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

ఎల్ఐసీ ఏజెంట్ల ఆలిండియా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్లకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆలిండియా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ అన్నారు. రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు ఆలిండియా కమిటీ పిలుపు మేరకు ఏజెంట్లు నిరసన ప్రదర్శన చేశారు.క్లాబాక్ కండీషన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ జోన్ జనరల్ సెక్రటరీ పీఎల్.నరసింహరావు మాట్లాడుతూ కమిషన్ తగ్గించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ గౌరవాధ్యక్షుడు ఎమ్మెల్సీ ఐవీ రావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జి.రవికిషోర్, పలువురు సీఐటీయూ నాయకులు, ఎల్ఐసీ ఏజెంట్లు, నాయకులు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయాన్ని సాధించవచ్చు

భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపులో అడిషనల్ ఎస్పీ అల్లూరు



సీనియర్ జట్టును అభినందిస్తున్న అడిషనల్ ఎస్పీ అల్లూరు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కృషి పట్టుదలతో విజయాన్ని సాధించవచ్చని జిల్లా అడిషనల్ ఎస్పీ అల్లూరు వెంకట సుబ్బరాజు అన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ గ్రౌండ్స్‌లో భాష్యం ప్రీమియర్ లీగ్-2024 క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిశాయి. ఫైనల్స్‌లో రాజమహేంద్రవరం దానవాయిపేట జట్టు(సీనియర్స్), దేవరపల్లి జట్టు(జూనియర్స్) విభాగంలో విజేతలుగా నిలిచాయి. రెండు జట్లకు ట్రోఫీ, మెడల్స్‌ను అడిషనల్ ఎస్పీ అందించారు. జోన్-2లో గెలిచిన జట్లు గుంటూరు సెంట్రల్ జోన్‌తో పోటీపడతాయని భాష్యం జోనల్ ఇన్‌చార్జి వి.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మిక సంఘం

నాయకుడు నాళం మృతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన నాళం వెంకటేశ్వరరావు(60) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు కుమార్తె ఉన్నారు. గతంలోనే భార్య మరణించింది. అంతకు ముందే కుమారుడు కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమార్తెకు వివాహం కావడంతో రాజమహేంద్రవరంలోని గోరక్షణపేటలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన ఒక్కరే రాజమహేంద్రవరం లలితానగరంలో ఈఎస్ఐ ఆసుపత్రి వెనుక ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా డయాలసిస్ పేషెంట్‌గా వైద్యం పొందుతున్నారు. మూడు రోజుల క్రితం కుమార్తె వచ్చి ఆయనకు ఆసుపత్రిలో చూపించి ఇంటి వద్ద దించి వెళ్లారు. ఆ తర్వాత వెంకటేశ్వరరావు బయటకు రాలేదు. ఇంట్లోంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమానికి అనుమానమొచ్చి వారి కుమార్తెకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా వెంకటేశ్వరరావు మృతదేహం మంచంపై ఉంది. అయితే ప్రతి రోజు వచ్చే అతని బంధువు కూడా మూడురోజులుగా రాకపోవడంతో అతను ఎప్పుడు మరణించాడో తెలియలేదు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురి తరలించారు.

నరసన్న ఆలయానికి రూ.4 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి, వివిధ రకాల సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం ఇప్పటి వరకు సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసినట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కళావేదిక వద్ద కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శాశ్వత పందిరి నిర్మాణానికి రూ.4 లక్షలు విరాళాన్ని ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించిన రూ.లక్ష చెక్కును అడ్వాన్స్‌గా వార్డు మెంబర్ కర్రి వీరగణేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. కాపవరం, పశ్చిమగోనగూడెం, నర్సాపురం, శ్రీరంగపట్నం ఆలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున విరాళాలు అందజేశారు. అలాగే అయ్యప్పస్వామి గుడి నిర్మాణానికి విరాళం ప్రకటించారు.

ఇష్టానుసారంగా ఇసుక దోపిడీ

కొవ్వూరులో పరిమితికి మించి 10 మెట్రిక్ టన్నుల ఇసుక లోడింగ్

- అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీల సీజ్
- నిబంధనలు మీరితే చర్యలు తప్పవు
- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత



కొవ్వూరులో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, నిర్దేశించిన లోడ్‌కు మించి ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రాణి సుస్మిత హెచ్చరించారు. మంగళవారం అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక లారీలను ఆమె సీజ్ చేశారు. కొవ్వూరులోని గోదావరి గట్టుపై వార్డు సచివాలయం వద్ద 1, ఔరంగాబాద్-2 ఇసుక ర్యాంపు వద్ద 1 ఇసుక లారీలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. లారీల్లో నిర్దేశించిన ఇసుక కంటే 10 మెట్రిక్ టన్నులు అధికంగా లోడ్ చేసి ఏలూరుకు తరలించడాన్ని గుర్తించారు. దీంతో రెండు లారీలను సీజ్ చేసి, లారీ యజమానులపై, ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై ఎఫ్ఐఆర్ వేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏఎస్ఐ జి. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



బల్లిపాడు ర్యాంప్‌లో ఇసుక పనులు చేస్తున్న ప్రొక్లెయినర్

బల్లిపాడులో ప్రొక్లెయినర్ సీజ్

తాళ్లపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు గ్రామంలోని ఓపెన్ రీచ్‌లో గుత్తేదారులు ప్రొక్లెయినర్‌ను ఉపయోగించి పనులు చేయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఆర్డీవో రాణీసుస్మిత ఇసుక ర్యాంప్‌కు విచ్చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవోతో గుత్తేదారు మాట్లాడుతూ రహదారి సరిచేసుకునే నిమిత్తం ప్రొక్లెయినర్‌ను తెచ్చామని తెలుపగా బంటా మనుషులతో పనిచేయడానికి మాత్రమే అనుమతులిచ్చారని, రీచ్‌లో యంత్రాలను ఉపయోగించడానికి అనుమతి తీసుకోవాలని ఆర్డీవో చెప్పారు. జీడిగుంట ర్యాంపులో కూలీలకు బదులుగా మిషన్లతో పనిచేయించడంతో కాంట్రాక్టు రద్దు చేశామని ఇక్కడ కూడా సీసీ ఫుటేజీలన్నీ పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పరిశీలించి ప్రొక్లెయినర్‌ను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంట డీటీ భారతి, ఎస్ఐ రామకృష్ణ, వీఆర్వో సంజీవరావు తదితరులు ఉన్నారు.

15న దొమ్మేటి విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని లాలాచెరువు పార్కులో ఈ నెల 15న ఆవిష్కరిస్తున్నామని శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘీయులంతా పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సత్తిబాబును మార్గాని చంటిబాబు సత్కరించారు.

రేపు రాజమహేంద్రవరంలో
ఆదాయ పన్ను శాఖ సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురువారం ఆదాయపు పన్నుల శాఖ వివాద్ సే విశ్వాస్ - 2024 అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఛాంబర్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్(విశాఖపట్నం), జాయింట్ కమిషనర్ డి.హేమ భూపాల్ హాజరవుతారన్నారు. వర్తకులంతా హాజరుకావాలని సూచించారు.

ఆంజనేయస్వామికి పూజలు
ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మార్గశిర ఏకాదశిని పురస్కరించుకుని గోకవరం అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. చైతన్య టాక్సీ సాండ్ ఓనర్స్ వర్కర్స్‌ఎం.కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 500 మం దికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ళ బాబు, ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు,ఎన్.వీరపండు,చిటికిన సూర్యనారాయణ,ఆలయ పూజారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్ పోటీలో లాస్య ప్రియకు
మొదటి బహుమతి



బహుమతి అందుకుంటున్న లాస్యప్రియ

రాజమహేంద్రవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో నాట్యంలో తమ విద్యార్థిని ఎం.లాస్యప్రియకు మొదటి బహుమతి లభించినట్టు శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్ తెలిపారు. తమ పాఠశాలలో చదువుతోపాటు సహ పాఠ్య కార్యక్రమాలైన నృత్యం, యోగ, చిత్రలేఖనం, గాత్ర సంగీతం మొదలైన కో కరిక్యులర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని లాస్యప్రియను అభినందించారు.

మానవ హక్కులకు రక్షణ కల్పించాలి

ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారుడు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్/కల్చరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని, చట్టాలను, కోర్టు తీర్పులను సక్రమంగా అమలు చేయకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మానవహక్కుల ఉల్లంఘనలో ప్రభుత్వాలే ప్రథమ స్థానంలో ఉన్నాయని చెప్పారు. మానవ హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్‌కేవీటీ ఆన్ క్యాంపస్ యాక్టివిటీస్‌లో 96మంది విద్యార్థులు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్విజ్‌లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు చెల్లం శేఖర్, సంతోషకుమారి, అల్లూరి జిల్లా నాయకులు గడతూరి చిన్నారావు, అరగంటి వీరభద్రారెడ్డి, కెచ్చెల అబ్బాయిరెడ్డి, జక్కుల పాండవులు, అధ్యాపకురాలు కె.సీతామహాలక్ష్మి, సయ్యద్ ఫరా ఎస్రూన్, ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ వైస్వర్ణశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అయినాపురపు

హక్కులు లేని మనిషి బానిస..

ఈ సమాజంలో హక్కులు లేని మనిషి బానిసతో సమానమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె ప్రకాష్‌బాబు అన్నారు. దానవాయిపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మానవ హక్కులపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ఎవ్వరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం నిరాకరించబడరాదన్నారు. స్వతంత్రంగా జీవించి తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు ఊతమిస్తాయని ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్షకు గురికాకుండా సమాన హక్కులతో జీవించాలన్నారు. ఎవ్వరికి ఎలాంటి న్యాయ సమస్యలు, సందేహాలు ఉన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. సదస్సులో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, సీడీపీవో నర్సమ్మ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. అలాగే డీఎల్ఎస్‌లో హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై న్యాయమూర్తి సమీక్షించారు. యాక్సిడెంట్ బాధితులకు పరిహారం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు అనుసరించాలన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

ఇంటింటా చెత్త సేకరణ నూరుశాతం జరగడం లేదు

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పరిధిలో ఇంటింట చెత్తసేకరణ నూరుశాతం జరగడం లేదని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య విభాగం అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిపారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తగినంత మంది సిబ్బంది, వాహనాలు ఉన్నప్పటికి ఇంటింటి చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. వాహనాల కదలికలపై ప్రతిరోజూ సాయంత్రం రిపోర్టు సమర్పించాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు ఐ.శ్రీనివాస్, కె.రామలింగారెడ్డి, ఎం.తులసీదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రిలు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేసిన ప్రభుత్వం
మాజీ మంత్రి వేణు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10: రాష్ట్రంలో బీసీలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభ సీట్లు కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. మత్స్యకారులను దగా చేసారని విమర్శించారు. టీడీపీలో యనమల లాంటి సీనియర్ నాయకులు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అంటున్నారంటే పరిస్థితి అర్థమౌతున్నదన్నారు. తనపై మంత్రి సుభాష్ చేసిన ఆరోపణలు నిరూపించాలన్నారు.

గౌతమి సూపర్ బజార్ వ్యవహారంపై అసత్య ప్రచారం తగదు
మాజీ ఎంపీ మార్గాని

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గౌతమి సూపర్ బజార్ భూమిని అక్రమంగా అన్యాక్రాంతం చేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తనపై అసత్య ప్రచారం చేయడం తగదని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ5 కోట్లు విలువ చేసే భూమి లీజు విషయంలో అవినీతికి పాల్పడ్డానని వాసు చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఖండించారు. అధికారంలో ఉన్నారు కాబట్టి సాక్ష్యాలతో నిరూపించాలని లేకపోతే పరువునష్టం దావా వేస్తానన్నారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన జిల్లా జడ్జి సునీత



బిక్కవోలులో జిల్లా జడ్జి సునీతను సత్కరిస్తున్న లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ సాయిబాబారెడ్డి

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను జిల్లా జడ్జి గంధం సునీత మంగళవారం దర్శించారు. ముందుగా శ్రీగోలింగేశ్వర, శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీగణపతిని దర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి స్వామివార్ల చిత్రపటాలను ఆమెకు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, కొమ్మోజు శ్రీనివాస్, బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌ను సందర్శించిన జిల్లా జడ్జి

అనపర్తి: మంగళవారం అనపర్తి నియోజకవర్గంలో పర్యటించిన జిల్లా జడ్జి గంధం సునీత అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. కోర్టు భవనాన్ని పరిశీలించిన ఆమె కోర్టు ఆవరణలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమై వారితో ముచ్చటించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు మేడపాటి రవిషణ్ముఖరెడ్డి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం



అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న శాస్త్రవేత్తలు

రాజానగరం, డిసెం బరు 10(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత దిశగా ఐసీఏఆర్-సీటీఆర్ఐ రాజమహేంద్రవరం, గ్రామీణ ఫౌండేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరినట్లు సీటీఆర్ఐ డైరెక్టర్ మాగుంట శేషుమాధవ్ తెలిపారు. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ ఎన్ఐఆర్‌సీఏ) రాజమహేంద్రవరం, గ్రామీణ ఫౌండేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ న్యూఢిల్లీ వారి గ్రో ప్రాజెక్టులో భాగంగా మహిళా సాధికారత దిశగా భవిష్యత్తులో 5 వేల మంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామికులుగా తీర్చిదిద్దే దిశగా అవగాహన ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఈ ఒప్పందంతో సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం (కలవచర్ల)హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టులు, గ్రామీణ ఫౌండేషన్ అధికారుల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపుదిద్దుకుని ఉభయ జిల్లాల్లోని స్వయం సహాయక బృందాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా నైపుణ్య శిక్షణలను అందిస్తామని గ్రామీణ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రుపా కాశ్యప్ తెలిపారు. సమావేశంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు ఎల్‌కె ప్రసాద్, హెచ్.రవిశంకర్, బి.హేమ, కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, జేవీఆర్ సత్యవాణి, పి.లక్ష్మి, ఎం.ఆనంద్ నాయక్, కె.అరవింద్ కుమార్, ఆసియా సయ్యద్, డేవిడ్ ద్రోనాడ్, ప్రశాంత్ వర్మ, పరమేశం తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి రోడ్ల అభివృద్ధికి సహకరించండి

సీఎమ్ చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే నల్లమిల్లి



సీఎమ్ చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో సిఎమ్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ రోడ్ల దుస్థితిపై తన అభ్యర్థనకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు.

రాజ్యసభ అభ్యర్థులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు: ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులను ఎమ్మెల్యే నల్లమిల్లి శుభాకాంక్షలు తెలుపుతూ సత్కరించారు. వెలగపూడిలో ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యత్వానికి మంగళ వారం నామినేషన్ దాఖలు చేసిన ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌లను ఎమ్మెల్యే సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో బాటు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మంత్రి సత్య కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న యశోద సినీ డైరెక్టర్లు హరిశంకర్, హరీష్ నారాయణ్

యశోద సినిమా డైరెక్టర్ల సందడి

బిక్కవోలు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం యశోద సినిమా డైరెక్టర్లు హరిశంకర్, హరీష్‌నారాయణ్ స్వామి వారిని దర్శించి పూజలు జరిపారు. ఈ ప్రాంతంలో సినిమా కథ కోసం వచ్చి స్వామిని దర్శించినట్లు వారు తెలిపారు. షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాసరెడ్డి వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై
గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్వారపూడి-అనపర్తి రైల్వే ట్రాక్ పై 35 ఏళ్ళ వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రాజమహేంద్రవరం జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మరణించి వుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు నీలం, తెలుపు, నలుపు రంగు గళ్ళ చొక్కా, సిమ్మెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతుడు చాతిపై శివలింగం , ఓంకారం గల పచ్చబొట్లు ఉన్నాయని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామని మృతుడు ఆచూకి తెలిసిన వారు సీఐ మొబైల్ 9440627551, ఎస్ఐ మొబైల్ 9491003239, స్టేషన్ నెంబరు 08332442821 కు సమాచారం అందించాలని కోరారు.

క్లాట్‌లో సత్తాచాటిన విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి నిర్వహించే క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్) డ్యాఫ్నీ సివిల్స్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి సత్తాచాటారు. వివరాలను డేఫ్నీ-విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ షిర్డిసాయి విద్యా సంస్థలు నిర్వహిస్తున్న డేఫ్నీ సివిల్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎస్.స్నేహితశ్రీ జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించగా, జి.రోహిణి కాంత్ గాంధీ 52వ ర్యాంకును, డి.వివేక్ 97వ ర్యాంకును, జిగణేష్ 104వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఇరవై మంది విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు పొందినట్లు శ్రీవిద్య తెలిపారు. విజేతలైన విద్యార్థులను శ్రీషిర్డిసాయి విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ డైరెక్టర్లు టి.శ్రీవిద్య, శ్రీలేఖ అభినందించారు.

కొనసాగుతున్న
మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో రాజమహేంద్రవరంలో ఏపీ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో యూనియన్ రాష్ట్ర నాయకులు యేసుబాబు, బుంగా యెషయారాజు మాట్లాడారు. ఈ సమ్మెకు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు మద్దతు తెలిపారు. శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఇదిలావుండగా సోమవారం నగరపాలక సంస్థ అధికారులు టెంట్‌ను తీయించివేయడం విమర్శలకు తావిస్తోంది. పోలీసుల అనుమతి తీసుకుని టెంట్ వేసినట్టు యూనియన్ నాయకులు చెబుతున్నారు. టెంట్‌ను తొలగించడంతో అన్నా కేంటిన్ వద్ద ఏర్పాటు చేసి నిరసన కొనసాగిస్తున్నారు. తమకు న్యాయం చేసే వరకు పోరాడతామని నాయకులు తెలిపారు.

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

రాజానగరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన పదో తరగతి యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ప్రాంతీయ పాఠశాల విద్యా సంచాలకులు జి.నాగమణి పేర్కొన్నారు. మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు పాఠశాల నాయకత్వ అభివృద్ధి శిక్షణ రెండవ సైకిల్ నాల్గవ బ్యాచ్ శిక్షణ తరగతులను మంగళవారం సందర్శించారు. పాఠశాలలో గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను నిరంతం పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ మాని టరింగ్ అధికారి గౌరీశంకర్రావు, ఎంఈవోలు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలు, రంపచోడవరం డిజన్‌కు సంబంధించి 233 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవ నియంత్రణ పద్ధతులతో పూలమొక్కలు



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త డీవీఎస్ రాజు

కడియం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేమగిరి పూల పరిశోధన ప్రాంతీయ కేంద్రంలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జీవ నియంత్రణ చర్యల ప్రాధాన్యతపై శిక్షణ కార్యక్రమం జరిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డీవీఎస్ రాజు రైతులకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్త, నెమటాలజీ డాక్టర్ టి.శిరీష మాట్లాడుతూ పూలమొక్కలలో ఆశించే నులిపురుగురులు, వాటిని జీవనియంత్రణ పద్ధతు ల ద్వారా నివారించే చర్యలు తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ మాధవన్ మాట్లాడుతూ పూలమొక్కల్లో వచ్చే తెగుళ్ళు, వాటి నివారణ చర్యలు తెలిపారు. కడియం ఉద్యాన అధికారి డి. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ బిందు, సూక్ష్మసేద్యం ఉపయోగాలు తెలిపారు. పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్‌పాల్, డాక్టర్ లక్ష్మిపతి రైతులకు పలు విషయాలను తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యాన సిబ్బంది, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంరక్షణలో భాగస్వాములు కావాలి

రాజానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి మానవ హక్కులను గుర్తించి, వాటిని సంరక్షించడంలో భాగస్వాములు కావాలని హెచ్‌బిఎస్ విభాగాధిపతి ఎం.సావిత్రి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి సీహెచ్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని గైట్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవం మనకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంలో ప్రతి ఏడాది డిసెంబరు 10న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో కాశీకృష్ణ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం నుంచి ఒక లారీ జీడిపిక్కల లోడ్‌తో బయలుదేరింది.. అప్పటి వరకూ కష్టపడిన కూలీలు లోడ్‌పైనే ఆదమరుపుగా నిద్రపోయారు..అర్ధరాత్రి.. చిమ్మచీకటి.. ఎదురుగా ఉన్న రోడ్డు కూడా సరిగా కనిపించదు.. అయినా లారీ వెళుతూ ఉంది.. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం వద్దకు వచ్చేసరికి లారీ ఒక చిన్న గోతిలో పడింది.. అంతే అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి జారిపోయింది.. లారీ బోల్తా పడిపోయింది. లోడు పైన ఉన్న ఏడుగురు కూలీలు బస్తాల కింద కూరుకుపోయి ఊపిరాడక మృతిచెందారు. అదే పగలైతే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదు..ఏడు కుటుంబాల్లో ఆ రాత్రి మళ్లీ వెలుగురాని చీకటి నింపింది..

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు సోదరులు.. తల్లితో కలిసి జీవనోపాధి నిమిత్తం వైజాగ్‌లో ఉండేవారు.. అయితే ఇటీవల అక్కడి నుంచి పల్సర్ బైక్‌పై నలుగురు తమ స్వగ్రామం బయలుదేరారు.. తెల్లవారేసరికి ఇంటికి చేరుకోవాలనుకునే కంగారు.. బైక్‌పై వేగంగా వెళుతున్నారు.. మరో వైపు వర్షం పడుతూనే ఉంది.. నిద్రమత్తు కారణమో ఏమో తెలియదు కానీ కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి వద్దకు వెళ్లేసరికి బైక్ ఒక్కసారిగా జారిపోయింది.. అంతే నలుగురు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు.. తల్లి ఒక పక్కకు పడి పోగా ముగ్గురు కుమారుల పైనుంచి లారీ వెళ్లిపోయి మృతిచెందారు.ఆ కుటుంబలో ఆ రాత్రి చీకటిని నింపింది.

ఎక్కడెక్కడో తిరిగొచ్చారు..ఆ ముచ్చట్లు కుటుంబీకులతో పంచుకోవాలనుకుంటూ ఆనందంగా వెళుతున్నారు.. రావులపాలెం మండలం ఈతకోట వచ్చేసరికి నిద్ర రావడంతో భర్త కారును పక్కగా నిలిపి పడుకుందామన్నాడు.. అయితే భార్య మాత్రం దగ్గరే కదా వెళ్లిపోదాం అంటూ స్టీరింగ్ తీసుకుంది.. అంతే కొద్ది దూరం వెళ్లేసరికి చీకటి కావడంతో రోడ్డును అంచనా వేయలేకపోవడంతో కారు కాలువలోకి దూసుకుపోయింది.. భర్త కళ్లెదుటే భార్య.. ఇద్దరు చిన్నారులు నీటిలో కొట్టుకుపోయారు.. తెల్లవారేసరికి చూస్తే విగతజీవులుగా మారారు.. అంతే ఆనందం ఒక్కసారిగా ఆవిరైపోయింది.. భర్తకు చీకటే మిగిలింది.

చీకట్లోకి.. జీవితాలు!

రాత్రి ప్రయాణం ప్రమాదకరం



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామ శివారు చిలకావారిపాకలవద్ద వద్ద సెప్టెంబరు 10వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడిన ఏడుగురు కూలీలు

చీకటి చాలా ప్రమాదకరమైనది.. ఎంతంటే ఎన్నో జీవితాలను తనలో కలిపేసుకుంటుంది.. బతికిఉన్నంత కాలం పలువురు జీవితాలను చీకట్లోకి నెట్టివేస్తుంది.. ఎవరికైనా తమ వారు తోడుంటేనే ఆనందం.. అందరూ ఉండి ఒక్కరూ లేకపోయినా ఏదో వెలితిగా ఉంటుంది.. పండగైనా.. ఫంక్షన్ అయినా వారులేని లోటు జీవితాంతం బంధువులను పీడిస్తూనే ఉంటుంది..అయినా రాత్రి వేళ ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేవారే కానరావడంలేదు. అసలు చీకట్లోనే ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి అని ఆరాతీస్తే.. అందులో ఒక వైపు అధికారులు.. మరో వైపు వాహనదారుల స్వయం తప్పిదమూ ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. నిబంధనలపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక నిద్ర ముంచుకొస్తున్నా ఇంటికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

శంఖవరం/కొవ్వూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాత్రి ప్రయాణం చాలా ప్రమాదకరం.. ఎన్నో జీవితాలు చీకట్లో కలిసిపోయాయి. ప్రస్తుతం ఆయా కుటుంబాలు జీవచ్ఛవాలుగా మారాయి. అయినా నేటికీ మార్పురావడంలేదు. వాహనదారులు మేల్కోవడంలేదు. రాత్రి సమయంలో ప్రయాణించి జీవితాలను పణంగా పెడుతున్నారు..అయినవారిని కోల్పోతున్నారు. కోనసీమ జిల్లా గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారు జామున జరిగిన సంఘటన అటువంటిదే. ఎక్కడెక్కడో కుటుంబం అంతా ఆనందంగా గడిపారు.. మంగళవారం తెల్లవారేసరికి స్వగ్రామం చేరుకోవాలని సోమవారం రాత్రికి బయలుదేరారు.. అంతా వారనుకున్నట్టు జరిగితే విహారయాత్ర ముచ్చట్లతో ఆ ఇల్లంతా సందడిగా ఉండేది. అయితే నిద్రమత్తు.. రోడ్డును అంచనావేయలేకపోవడం తదితర కారణాలతో ఆ కుటుంబం తీవ్ర విషాదంతో నిండింది.రాత్రి కావడంతోనే ఈ ప్రమాదం జరిగింది. అదే పగలు అయితే రోడ్డు కనిపించేది..ప్రమాదమూ జరిగి ఉండేది కాదు.రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరం సుమా.. ఇకనైనా మేల్కొండి.

రాత్రి ప్రమాదాలే ఎక్కువ..

ఉమ్మడి జిల్లాలో 100 కిలోమీటర్ల మేర 16వ నెంబరు జాతీయ రహదారి,60 కిలోమీటర్ల మేర 214 జాతీయ రహదారి ఉంది. కోనసీమ, ఏజెన్సీ ప్రాంతాల్లోను పలు రహదారులు ఉన్నాయి.



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లవద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ(ఫైల్)

జాతీయ రహదారులపై నిత్యం వేలాది లారీలు దేశంలో పలు రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలను అరికట్టేందుకు..ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు రోడ్లను రెండులైన్లు, నాలుగు లైన్లుగా వెడల్పు చేసినా ఏటా ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వీటిలో రాత్రి సమయంలో జరిగిన ప్రమాదాలే ఎక్కువ. వీటిలో నిద్రమత్తు కారణంగా జరిగిన ప్రమాదాలే ఎక్కువ. రాత్రివేళలో రోడ్లు ఖాళీగా ఉండడం, వేగంగా నడిపితే త్వరగా ఇంటికి వెళ్లిపోవచ్చనే కారణంగా ఎక్కువ కిలోమీటర్లు వాహనాలు నడిపి ఉండడం నిద్రవచ్చినా బలవంతంగా నిద్రను ఆపుకుని వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఒక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే గత 10నెలల కాలంలో వెయ్యి ప్రమాదాలు జరగ్గా 500 మందిపైనే మృత్యువాత పడ్డారు. నిద్రమత్తులో ప్రమాదం జరిగితే కనీసం బ్రేక్ కూడా వేసే అవకాశం ఉండదు కాబట్టి ఎక్కువ శాతం వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. కొందరు క్షతగాత్రులుగా మారి అవయవాలు కోల్పోయి జీవచ్ఛవాలుగా మారి ఇంటికే పరిమితమవుతున్నారు.

నిబంధనలు గాలికి..

త్వరగా ఇళ్ల చేరుకోవాలనే కారణంతో నిద్ర ముంచుకొస్తున్నా చాలా మంది వాహనాలు నడుపుతారు. కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా లారీలను నిలుపుదల చేస్తారు. మరికొంత మంది నిషేధిత ప్రాంతాల్లో లారీలు నిలుపుదల చేస్తారు.అయినా పోలీసులు, రవాణాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎవరిది తప్పయినా నిద్రమత్తులో వాహనం నడిపేవారే ప్రాణాలు కోల్పోతున్నారు. జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేయకూడదు.వాహనాల నిలుపుదలకు ప్రత్యేకంగా నేషనల్ హైవే అథారిటీ స్థలాలు కేటాయిస్తోంది. కానీ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపివేస్తుంటారు. వీటిని నిద్రమత్తులో గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదాలకు ఎక్స్‌ప్రెస్ హై..వే

- అతివేగం.. నిద్రమత్తు
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- జీవచ్ఛవాలుగా కుటుంబాలు
- పట్టని రాత్రి నిబంధనలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- వచ్చీరాని డ్రైవింగ్‌తో యాక్సిడెంట్లు
- 10 నెలల్లో వెయ్యి ప్రమాదాలు
- 500 మందిపైనే మృత్యువాత

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల నుంచి దివాన్‌చెరువు వరకు 55 కి.మీ ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవేపై రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారింది..అతివేగం కారణంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.గతేడాది హైదరాబాద్ నుంచి కుటుంబంతో కారులో బయలుదేరిన ఒక వ్యక్తి నల్లజర్ల వద్ద రోడ్డుపై ఆపిన లారీని గమనించకుండా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆత్రేయపురం మండలానికి చెందిన ఒక కుటుంబంలో నలుగురు మృత్యు వాతపడ్డారు. నవంబరు 3వ తేదీన కొవ్వూరు మండలం పంగిడి శివారు దేచర్ల వద్ద ఎక్స్‌ప్రెస్ హైవేపై కారు ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఒక వ్యాన్ యజమాని దానిమ్మకాయల లోడ్ వేసుకుని వేగంగా వస్తున్నాడు. నల్లజర్ల మండలం దూబచర్ల వద్ద వ్యాన్ టైర్ ప్యాచ్చీపడడంతో డివైడర్ దాటుకుని వెళ్లిన వ్యాన్ మరో లారీ ఢీకొట్టింది.. దీంతో ఆ వ్యాన్ యజమానికి కం డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇటీవల కొవ్వూరు వద్ద ఒక లారీ మరొక లారీని ఢీకొన్న ఘటనలో డ్రైవర్ కేబిన్‌కు వేలాడుతూ కనిపించిన ఘటన హృదయ విదారకంగా మారింది.ఈ రహదారిపై ఇటువంటి ప్రమాదాలు సర్వ సాధారణంగా మారిపోయాయి.



పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారులో మంగళవారం తెల్లవారుజామున పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. ఈ ఘటనలో తల్లీకుమారుడు మృతిచెందగా, మరో కుమారుడు గల్లంతయ్యారు



8

చీకట్లో ప్రయాణం.. చితికి తీసుకెళ్లింది!

10 కి.మీ రోడ్డు.. ప్రమాదకరం

పి.గన్నవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓ ప్రమాదం జీవితాలనే తారుమారు చేస్తుంది. అప్పటివరకు ఆనందంగా గడిపే కుటుంబాలు ఒక్క ఘోర ప్రమాదంతో విషాదంతో నిండిపోతాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజవరం-పొదలాడ రహదారిలో కొన్నేళ్లుగా జరు గుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.పి.గన్నవరం నుంచి గంటి వరకు 10 కిలో మీటర్లు మేర ఉన్న రహదారి చెంతనే ఉన్న ప్రధాన పంటకాల్వ ప్రమాదాలకు నిలయంగా మారింది.కొన్నేళ్లుగా ఇదే రహదారిలో జరుగుతున్న ప్రమాదాలు కొన్ని కుటుంబాలను చిన్నాభిన్నం చేశాయి.2017, నవంబరు 11న ఒక ఆటో కూలీలతో సహా పంట కాల్వలోకి దూసుకుపోతే పగటిపూట కావడంతో ఓ ప్రైవేటు ఉద్యోగితో పాటు స్థానికుల సాయంతో అందరూ బతికి బయట పడ్డారు.2022 డిసెంబరు 18న ద్విచక్ర వాహ నాన్ని భారీవాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక రు మృతిచెందారు. 2024, ఫిబ్రవరి 18న ఒక కుటుంబం కారుతో సహా పంటకాల్వలోకి దూసుకెళితే అటుగా వెళ్తున్న ఓ కానిస్టేబుల్ కాల్వలోకి దిగి ఆ కుటుంబాన్ని రక్షించాడు. 2024, మే 14న ధాన్యం లోడును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు.

అభివృద్ధికి మరో అడుగు!



- నేడు,రేపు కలెక్టర్లతో సీఎం మీటింగ్
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ప్లాన్
- జీవీఏలో జిల్లాకు 10వ స్థానం
- జనవరి నుంచి జన్మభూమి
- పలు అంశాలపై తీవ్రంగా చర్చ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లా స్థాయిలో నియోజకవర్గావారీ ఐదేళ్ల ప్రణాళికలు రూపొందించడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రాజధాని అమరావతిలో బుధవారం, గురువారం సీఎం నారా చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో పలు అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటి వరకూ జిల్లా ప్రగతి, జిల్లాలోని సమస్యలు, వాటి పరిష్కాలు, పథకాలు అమలు తీరు, అవసరాలు, వంటివాటిపై చర్చించడంతో పాటు భవిష్యత్‌లో చేయవలసిన పనులపై కూడా కూలంకషంగా చర్చించి నిర్ణయాలు తీసుకోకున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో ఉత్పత్తి విలువ మొత్తాన్ని జీవీఏ అంటారు. జీవీఏ నుంచి ఉత్పత్తి సబ్సిడీలను తీసి వేస్తే జీడీపీ వస్తుంది. మన జిల్లాకు సంబంధించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో గ్రాస్ వేల్యూ యాడెడ్ (జీవీఏ)లో జిల్లా 7వ స్థానంలో ఉంది. 18,740 కోట్లు జీవీఏ ఉంది. పరిశ్రమ రంగంలో జీవీఏ రూ.9,019 కోట్లు, రాష్ట్రస్థాయిలో జిల్లాకు 2.86 శాతం.ఇది 14వ స్థానం. సేవల రంగంలో జీవీఏ రూ.20,873 కోట్లు, ఇది 4.34 శాతం.8వ స్థానం. మొత్తం ఈ మూడు రంగాల జీవీఏ రూ.48,633 కోట్లు. రాష్ట్ర వాటాలో 3.97 శాతం. మొత్తం 10వ ర్యాంకులో ఉంది. జీడీపీ 2022- 23లో రూ.51,805 కోట్లుగా ఉండగా 2028-29 నాటికి 1,15,583కు పెరగనుంది. జిల్లాలో కొత్తగా పీఎంఏవై కింద అర్బన్ ప్రాంతంలో 3666, గ్రామీణ ప్రాంతంలో 3823 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టారు. వీటిని జనవరి 1 నుంచి మార్చి 31లోపు పూర్తిచేయనున్నారు.ఇప్పటికే జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం పై కలెక్టర్ పూర్తి మోనటరింగ్ చేసి సకాలంలో లక్ష్యాలు చేరేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం జిల్లాలో 1,69,908 మిస్సింగ్ కేసులు ఉండగా ఇప్పటి వరకూ 9906పై యాక్షన్ తీసుకున్నారు.ఇంకా 1,60,002 పరిశీలించాల్సి ఉంది. ఎన్‌పీసీఐకు సంబంధించి జిల్లాలో 2,29,375 మంది బ్యాంక్ ఖాతాలతో లింక్ కాలేదు.ఇంత వరకూ 2,24,154కు సంబంధించి చర్యలు తీసుకున్నారు. 5222 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో హౌస్ ఇమేజ్, జియో కోఆర్డినేషన్‌కు సంబంధించి జిల్లాలో 6,55,850 హౌస్ హోల్డ్స్ ఉండగా 6,25,964 పూర్తయ్యాయి. 29,909 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 95.44 శాతం పూర్తయింది.జిల్లాలో 49,189 మంది పిల్లలకు ఆధార్‌కార్డు గుర్తింపు లేనట్టు గుర్తించి 3707 మందిని ఇప్పటికే ఆధార్‌లో నమోదు చేయించారు. ఇంకా 45,482 నమోదు కావలసి ఉంది. జిల్లాలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు 107 ఉండగా 104 సొసైటీలలో ఇప్పటికే రికార్డులన్నీ కంప్యూటరీకరించారు. ఇంకా మూడు కంప్యూటరీకరించవలసి ఉంది.

రెండు రోజులు చర్చించే అంశాలివే!

సీఎంతో జరిగే కలెక్టర్ల మీటింగ్‌లో పాల్గొనడానికి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహకిశోర్ ఇప్పటికే అమరావతి వెళ్లారు. రెండు రోజుల పాటు కాన్ఫరెన్స్ జరగనుంది. మొదటి రోజు వ్యవసాయం, సహకారం, హార్టికల్చరల్, పశుసంవర్థక, మ త్స్యఆక్వా, సివిల్ సప్లయిస్, ఫారెస్ట్, జలవ నరుల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, ఉపాధి హామీ పథకం,సెర్ప్, ఆర్ డబ్ల్యుఎస్,అర్బన్ డెవలపెంట్, శాంతిభద్ర తలపై సమీక్షిస్తారు. రెండో రోజు పరిశ్రమలు, ఐటి, విద్యుత్, టూరిజం, హెచ్ఆర్‌డీ,స్కిల్ డెవలప్‌మెంట్ హౌసింగ్, బీసీ, ఎనర్జీ, విమె న్ వెల్ఫేర్, మైన్స్, ఎక్సయిజ్ వంటి వాటిపై సమీక్షిస్తారు. ముఖ్యంగా ఉచిత ఇసుక మీద చర్చించే అవకాశం ఉంది.జనవరి నుంచి జన్మ భూమి కార్యక్రమాన్ని మళ్లీ మొదలుపెట్టే అవకాశాలపై ప్రస్తావించనున్నట్టు సమాచారం.

జీజీహెచ్‌లో వైద్యసేవల పర్యవేక్షణకు

ఓఎస్‌డీ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ బోధనాసుపత్రి)లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పర్యవేక్షించడంతో పాటు వాటి వివరాలను ప్రభుత్వానికి నివేదించడానికి ప్రత్యేక అధికారిని నియమిస్తూ కలెక్టర్ ప్రశాంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కోనేరు రంగారావు కమిటీ (కేఆర్ఆర్‌సీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. భాస్కర్‌రెడ్డిని జీజీహెచ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీస్ (ఓఎస్‌డీ)గా నియమించారు. కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో ఓఎస్‌డీ హోదాలో భాస్కర్‌రెడ్డి జీజీహెచ్‌ను వారంలో రెండు సార్లు సందర్శించాల్సి ఉంటుంది.

గంజాయి, సారా అరికట్టాలని

ఎస్పీకి ఎమ్మెల్యే వినతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా పెరిగిపోయిన గంజాయి ,సారా విక్రయాలను పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ డి నరసింహకిశోర్‌ను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు ఎస్పీ నరసింహకిశోర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరం 46,47 డివిజన్లలో సారా, గంజాయి విక్రయాలు సాగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే దృష్టి పెట్టాలన్నారు. టీడీపీ నాయకులు యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, పెంటపాటి సుభాష్ పాల్గొన్నారు.

ఇష్టానుసారం..ఇసుక దోపిడీ



కొవ్వూరులో అధిక లోడ్ లారీని ఆపి సీజ్ చేస్తున్న ఆర్‌డీవో

- నిబంధనలు మీరుతున్న నిర్వాహకులు
- 18 బోట్లు సీజ్..2 లారీలు పట్టివేత
- కేసుల నమోదుకు అధికారుల ఆదేశం

రాజమహేంద్రవరం,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమాలు సాగుతూనే ఉన్నాయి. అధికారులు అదే స్థాయిలో స్పందిస్తున్నారు. సోమవారం కొవ్వూరు, రాజ మహేంద్రవరంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం చేపడుతున్న 18 బోట్లను అధికారులు సీజ్ చేశారు. బ్రిడ్జిల ప్రక్కన ఇసుక తీస్తున్నారనే కారణంతో కొవ్వూరులో 10, ధోబీఘాట్‌లో 8 బోట్లను అధికార్లను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయా బోటు యజమానులపై కేసులు నమోదు చేశారు.ఇదిలా ఉండగా కొవ్వూరు, తాళ్లపూడిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలను ఆర్‌డీవో రాణి సుస్మిత అడ్డుకుని సీజ్ చేశారు. తాళ్లపూడిలో యంత్రాన్ని సీజ్ చేశారు గాయత్రి ఇసుక ర్యాంపులలో మంగళవారం బోట్స్‌మన్ సొసైటీల ద్వారా తీసే ఇసుక తీత నిలిచిపోయింది. సొసైటీలకు కేటాయించిన ఇసుక తీత లక్ష్యాలు పూర్తి కావడంతో నిలిచిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంకా కొత్త కేటాయింపులు లేవు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సీఎం మీటింగ్‌కు వెళ్లడంతో ఇక్కడ ఎప్పుడు కేటాయింపులు జరుగుతాయనేదానిపై స్పష్టత లేదు. అప్పటి వరకూ ఇక్కడ ఇసుక తీత జరిగే అవకాశం లేదు.ఈలోపు కేటాయింపులు వస్తే ఇసుక తీత మొదలవుతోంది. బ్రిడ్జిల పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతున్నారనే కారణంతో సీజ్ చేసిన బోట్ల నిర్వాహకులపై అధికారులు క్రిమినల్ కేసు కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. తాము కేసు పెట్టామని అధికారులు చెబుతుంటే, ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పోలీసులు చెబుతున్నారు. ఇందులో రాజకీయనేతల ఒత్తిడి కూడా ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. ఇక ఇటీవల టెండర్లు పిలిచిన వంగలపూడి -1,2, ఓపెన్ ర్యాంపుల టెండర్లను రద్దు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.అక్కడ ఏకంగా టన్ను కేవలం రూ.11కే సరఫరా చేస్తానని టెండర్ వేశారు.మరో చోట కేవలం రూ.6 కే టన్ను ఇస్తానని టెండరు వేయడం గమనార్హం. ఇలా తక్కువ కోట్ చేస్తూ టెండర్లు వేయడం అంటే ఇసుక దోపిడీకి ప్లాన్ చేసినట్టేననే కారణంతో టెండర్లను పెండింగ్‌లో పెట్టారు.

15వ ఆర్థిక సంఘం నిధుల
వినియోగంపై అభిప్రాయ సేకరణ


ఎంపీడీవో కార్యాలయంలో శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ఎన్‌సీఆర్ బృందం సభ్యులు

గోపాలపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ నుంచి గ్రామ పంచాయతీ ఖాతాలకు జమయిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, తలెత్తిన సమస్యలు, స్థానిక వనరుల ఆర్థిక పరిపుష్టి తదితర అంశాలపై ఎన్‌సీఆర్ బృందం మండలంలోని గంగోలు, భీమోలు, రాజంపాలెం, కరగపాడు, కోమటికుంట పంచాయతీ అధికారుల నుంచి అభిప్రాయలు మంగళవారం సేకరించారు. ఈ సందర్భంగా ఆంధ్రా, తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్లు లింగాల శ్రీకాంత్, సంస్థ ప్రతినిధి కె.శివకుమార్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంలో ఎదురైన సవాళ్లను ఏ విధంగా ఎదుర్కొన్నారో, అన్‌టైడ్ ఫండ్స్ షరతులు జోడించటం ద్వారా ఏవిధమైన ఇబ్బందులు తలెత్తుతాయో పంచాయతీ అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే టైడ్‌ఫండ్స్ ఎలా వినియోగించాలి, ఆర్థిక వనరులకు సంబంధించిన ఆర్థిక నిధులు ఏవిధంగా సమకూర్చుకుంటున్నారో అభిప్రాయాలు సేకరించి, గ్రామాల్లో ప్రణాళిక, సామాజిక ప్రమేయం ఎలా ఉంది తదితర అంశాలు తెలుసుకుని కేంద్రం పంచాయతీ రాజ్‌శాఖకు నివేదిస్తామన్నారు. దీని వల్ల 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు. వారి వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో పీఎస్ఎస్ శ్రీనివాస్ ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి


విజయవాడలో ధర్నా చేస్తున్న జోడాల, ఉద్యోగులు

తాళ్లపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద పెన్షన్ సాధన సమితి సభను నిర్వహించినట్టు ఏపీ సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి 50 మంది ఉద్యోగులు పాల్గొన్నారని, గత ప్రభుత్వంలో అక్రమంగా మోపిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, సీపీఎస్ ఉద్యోగులతో తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరామన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు జంగా లక్ష్మీపతి, రాము, రమాదేవి, ప్రకాష్, విజయ, దుర్గాభవాని పాల్గొన్నట్టు జోడాల తెలిపారు.

నిర్మలగిరిలో సెమీ క్రిస్మస్ వేడుకలు


గౌరీపట్నం నిర్మలగిరిలో సెమీ క్రిస్మస్ వేడుకల దృశ్యం

దేవరపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాత ఆలయం వద్ద మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ ఆధ్వర్యంలో ఈ వేడుకల్లో ముందుగా మేరీమాత విగ్రహానికి పూలమాలలు వేశారు. సెమీక్రిస్మస్ విశిష్టతను ఏసుక్రీస్తు జీవితచరిత్రను వివరించారు. పుణ్యక్షేత్ర కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు, దిరిశిన ఫాతిమారాణి, సెయింట్ మేరిస్ నిర్మల్ హృదయ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎల్‌పీఆర్ సిస్టర్స్, శ్యామ్, శివ, అనిల్, దుర్గారావు, పండు, మోషే ఆధ్వర్యంలో జాన్‌పీటర్‌ను సత్కరించారు.క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులకు రొట్టెలు, పండ్లు, అందజేశారు.

బీపీఎల్ జూనియర్స్ విజేత దేవరపల్లి జట్టు


విజేత జట్టుకు కప్పును అందజేస్తున్న ఏఎస్పీ చెంచిరెడ్డి

దేవరపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మున్సిపల్ కాలనీ మైదానంలో మంగళవారం జరిగిన క్రికెట్ పోటీల్లో దేవరపల్లి భాష్యం విద్యార్థులు ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసి ఏఎస్పీ చెంచిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతను, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ బి.పేరయ్యనాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జరిగిన భాష్యం ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) క్రికెట్ పోటీల్లో ఏడు భాష్యం బ్రాంచీలు పాల్గొన్నాయని, ఫైనల్స్‌లో జంగారెడ్డిగూడెం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో దేవరపల్లి జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ అంజనేయులు, ప్రిన్సిపాల్స్ సూర్యనారాయణ, హరిబాబు, సత్యనారాయణ, పార్వతి, దుర్గాప్రసాద్, రాహుల్, వ్యాయమా ఉపాధ్యాయులు మధు, స్వాతి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

గోపాలపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడికి న్యాయస్థానం నాలుగేళ్ల సాధారణ జైలు శిక్ష రూ.500 జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం వంకబొత్తప్పగూడెం గ్రామానికి చెందిన పట్టేం కిషోర్ ఈ ఏడాది మే నెలలో గోపాలపురం మండలం రాంపాలెం గ్రామంలోని ఓ ఇంటి తలుపులు పగులగొట్టి రూ.10 వేలు నగదు అపహరిస్తుండగా ఇంటి యజమాని చుట్టుపక్కల వారి సాయంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాల అనంతరం నేరం రుజువుకావడంతో కొవ్వూరు ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి కె.నాగలక్ష్మి నిందితుడికి నాలుగేళ్ల జైలు, రూ.500 జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో రెండేళ్లు..

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్లు దొంగతనం కేసులో నిందితుడికి రెండేళ్ల సాధారణ కారాగార శిక్ష విధించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. 2023 ఫిబ్రవరి 18న కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చిన జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన లొల్లా గణేష్ వీవో ఫోన్‌ను, రాజమహేంద్రవరానికి చెందిన చిట్టే విజయబాబు ఒప్పో ఫోన్‌లను కాకినాడ జిల్లా గొల్లపాలెం గ్రామానికి చెందిన నంబారు గణేష్ దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి పట్టణ ఎస్ఐ డి.భూషణం కేసునమోదు చేశారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో మంగళవారం కొవ్వూరు సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కె.నాగలక్ష్మి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పీపీ డి.బాబూరావు వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ వి.హరి సహకరించారు.

బాలుడి అదృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలుడి అదృశ్యంపై కేసునమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులోని పోతురాజు దిబ్బకు చెందిన కాశిరెడ్డి సీతారాం ఈ నెల 9వ తేదీన తెల్లవారుజాము 4గంటల సమయంలో మార్నింగ్ వాక్‌కు అని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతికారు. కనిపించకపోవడంతో తండ్రి కాశిరెడ్డి కోటిబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

బోటు యజమానులపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు కం రైలు బ్రిడ్జి వంతెన సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపట్టిన 12 బోట్ల యజమానులపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. ఈ నెల 9న కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జికి 200మీటర్ల దూరంలో నిబంధనలను అతిక్రమించి లైసెన్సులు, జియో కోఆర్డినేట్స్ లేకుండా ఇసుక తవ్వుతున్న 12 బోట్లను టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు సీజ్ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అఖండ గోదావరి కుడి గట్టు విభాగం ఏఈ జి.మణికంఠరాజు 12 బోట్లకు సంబంధించి 10 మంది యజమానులపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కొవ్వూరులో మానవ హక్కుల దినోత్సవం


కొవ్వూరులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. మంగళవారం కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు వారాల జాతీయ జెండా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జె.సునీత ప్రారంభించారు. కళాశాల ఉమెన్ ఎంపర్‌మెంటు డిపార్టుమెంటు, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు లింగ సమానత్వము, బాల్య వివాహాలను అరికట్టుట, బాలికల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణ, పుష్పాంజలి, సత్య సునీత, భూపతిరాయలు, కాంచనమాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నల్లజర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12నుంచి 27వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహశీల్దార్ కృష్ణారావు తెలిపారు. 12న అనుమునిలంకలో ప్రారంభమై 27న పడమర చోడవరంలో ముగిస్తామన్నారు. రైతులు భూ సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఇష్టానుసారంగా ఇసుక దోపిడీ

కొవ్వూరులో పరిమితికి మించి 10 మెట్రిక్ టన్నుల ఇసుక లోడింగ్

- అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీల సీజ్
- నిబంధనలు మీరితే చర్యలు తప్పవు
- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత


కొవ్వూరులో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కొవ్వూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, నిర్దేశించిన లోడ్‌కు మించి ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రాణి సుస్మిత హెచ్చరించారు. మంగళవారం అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక లారీలను ఆమె సీజ్ చేశారు. కొవ్వూరులోని గోదావరి గట్టుపై వార్డు సచివాలయం వద్ద 1, ఔరంగాబాద్-2 ఇసుక ర్యాంపు వద్ద 1 ఇసుక లారీలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. లారీల్లో నిర్దేశించిన ఇసుక కంటే 10 మెట్రిక్ టన్నులు అధికంగా లోడ్ చేసి ఏలూరుకు తరలించడాన్ని గుర్తించారు. దీంతో రెండు లారీలను సీజ్ చేసి, లారీ యజమానులపై, ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై ఎఫ్ఐఆర్ వేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏఎస్ఐ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


బల్లిపాడు ర్యాంప్‌లో ఇసుక పనులు చేస్తున్న ప్రొక్లెయినర్

బల్లిపాడులో ప్రొక్లెయినర్ సీజ్

తాళ్లపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు గ్రామంలోని ఓపెన్ రీచ్‌లో గుత్తేదారులు ప్రొక్లెయినర్‌ను ఉపయోగించి పనులు చేయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఆర్డీవో రాణీసుస్మిత ఇసుక ర్యాంప్‌కు విచ్చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవోతో గుత్తేదారు మాట్లాడుతూ రహదారి సరిచేసుకునే నిమిత్తం ప్రొక్లెయినర్‌ను తెచ్చామని తెలుపగా బంటా మనుషులతో పనిచేయడానికి మాత్రమే అనుమతులిచ్చారని, రీచ్‌లో యంత్రాలను ఉపయోగించడానికి అనుమతి తీసుకోవాలని ఆర్డీవో చెప్పారు. జీడిగుంట ర్యాంపులో కూలీలకు బదులుగా మిషన్లతో పనిచేయించడంతో కాంట్రాక్టు రద్దు చేశామని ఇక్కడ కూడా సీసీ ఫుటేజీలన్నీ పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పరిశీలించి ప్రొక్లెయినర్‌ను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీటీ భారతి, ఎస్ఐ రామకృష్ణ, వీఆర్వో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం పోలీస్‌స్టేషన్‌కు
ఇన్వర్టర్ అందజేత

గోపాలపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మౌలికవసతుల కల్పనకు అవసరమైన ఇన్వర్టర్, మోటార్‌ను మద్దిపాటి గంగరాజు మంగళవారం అందజేశారు. ఆయన వెంట రైటర్ దుర్గారావు ఉన్నారు.

తీపర్రులో ఉచిత వైద్య శిబిరం



పెరవలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తణుకు ఆపిల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో తీపర్రు గ్రామ సచివాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్లు సాయిహరి, కోటేశ్వరరావు, శివనాగరాజు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపరీక్షలు, ఈసీజీ, గుండె స్కానింగ్ పరీక్షలు 150 మందికి నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కుందుల భూపతిరావు, ఎంపీటీసీ ర్యాలీ వెంకటేశ్వరరావు, కరాటం చిన్ని, సింహాద్రి గంగరాజు పాల్గొన్నారు.

గోతులతోనే సరా!

- గోపాలపురంలో పూర్తి కాని కల్వర్టు నిర్మాణం
- స్థానికుల ఇబ్బందులు


కల్వర్టు నిర్మాణం కోసం తీసిన గోతిలో కర్రతో లోతు చూపుతున్న స్థానికుడు

గోపాలపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ వీధి 1వ వార్డులో కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారిపై కల్వర్టు నిర్మించడానికి హుటాహుటిన గోతులు తీశారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాథమిక అంచనా నివేదిక సిద్ధం చేయకపోవడంతో కల్వర్టు నిర్మాణం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆ రహదారిలో వెళ్లే పాదచారులు, వాహనచోదకులు నానా తంటాలు పడుతున్నారు. రాత్రుళ్లు ఆ గోతిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రాథమిక అంచనా నివేదిక సిద్ధం చేసి పనులు సత్వరం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి


వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు ఎం.ఫణీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉండ్రాజవరంలో పారామెడిక్స్, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడారు. ఇటీవల మానవుడి జీవన శైలిలో వచ్చిన మార్పులు క్యాన్సర్‌కు కారణమవుతున్నాయన్నారు. అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సార్వత్రిక క్యాన్సర్ పరీక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. 18ఏళ్లు దాటిన వారందరూ ఈ పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వైద్యులను అసోసియేష్ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో డెల్టా హాస్పిటల్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, పి.చిన్ని, సుధాకరరావు, సిద్ధూ, ఎం.ముత్తయ్య,ప్రేమ్‌కుమార్, జిన్నా, కిరణ్ పాల్గొన్నారు.

అలిసిన ప్రయాణం... ఆయువు తీసింది!

విహారయాత్ర విషాదాంతమైంది. చిమ్మ చీకటి ఆపై 'అలిసి'న ప్రయాణం శాపంగా మారి ఆయువు తీసింది.. చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగించే భార్యాభర్తలు, చక్కనైన ఇద్దరు కుమారులు..హాయిగా సాగిపోతున్న ఆ కుటుంబ ప్రయాణం మంగళవారం తెల్లవారుజామున కుదుపులకు గురైంది. భార్య, ఇద్దరు పిల్లలను పోగొట్టుకుని ఓ వ్యక్తి ఒంటరిగా మిగిలాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటలో మంగళవారం తెల్లవారుజామున ప్రధాన పంట కాల్వలోకి కారు దూసుకుపోయిన సంఘటన ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.

- తెల్లవారేదాకా ఆగితే ప్రాణాలు మిగిలేవి
- పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు ప్రమాదంలో భార్య, ఇద్దరు కుమారులను పోగొట్టుకుని ఒంటరైన భర్త
- కుటుంబం కన్నీరుమున్నీరు
- పి.గన్నవరం మండలం పోతవరంలో విషాదఛాయలు


సంఘటనా స్థలంలో భార్య, కుమారుడి మృతదేహాల వద్ద విలపిస్తున్న విజయ్‌కుమార్


విహారయాత్రలో విజయ్‌కుమార్ కుటుంబం(ఫైల్)


పోతవరం విజయ్‌కుమార్ నివాసంలో కోడలు, మనవళ్ల కోసం రోదిస్తున్న వీరవెంకటసత్యనారాయణ, లక్ష్మి దంపతులు

పి.గన్నవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్‌కుమార్ భార్య ఉమా (32), కుమారుడు రోహిత్(9) కారు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. మనోజ్ (5) అనే మరో కుమారుడు కాల్వలో గల్లంతయ్యాడు. కేవలం 5 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే వారు గమ్య స్థానానికి వెళ్లిపోయేవారు. ఇదంతా పదిహేను నిమిషాల ప్రయాణం అంతే..కానీ మృత్యువు వారిని క్షేమంగా ఇంటికి చేరనీయలేదు. చిమ్మ చీకటి, ఆపై మంచు ఈ సమయంలో రోడ్డు ప్రయాణం ఎంత ప్రమాదమో ఈ ఘటన చాటిచెప్పింది.

చక్కని కుటుంబం..హాయిగా సాగే జీవితం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయ్ కుమార్ బీఎస్సీ, బీఈడీ చదివాడు. కొవిడ్ ముందు వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో పాఠాలు చెప్పుకుని జీవనం సాగించేవాడు. లాక్‌డౌన్ ప్రభావంతో వచ్చిన ఇబ్బందులతో ఉద్యోగం మానేసి ఓ కారు కొనుగోలు చేసి స్థానికులకు డ్రైవింగ్ నేర్పుతూ, మధ్య మధ్యలో కిరాయిలకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విజయ్‌కుమార్ భార్య ఉమాకు కూడా డ్రైవింగ్ రావడంతో ఆమె కూడా మహిళలకు డ్రైవింగ్ నేర్పుతూ భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. వారికి రోహిత్ (మూడో తరగతి), మనోజ్ (యూకేజీ) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవింగ్ నేర్పుతూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో ఈ కుటుంబం ఆనందంగా జీవిస్తోంది. కష్టపడి పనిచేసుకోవడం కొన్ని డబ్బులు దాచుకుని కుటుంబం అంతా కలిసి బయటకు వెళ్లడం ఇలా సాగుతోంది వారి జీవిత ప్రయాణం..కానీ ఒక్క ప్రమాదం ఆనందకరమైన కుటుంబంలో విషాదాన్ని నింపింది. తేరుకోలేనంతగా దెబ్బతీసింది. విజయ్‌కుమార్ వైజాగ్ నుంచి నిరంతరాయంగా కారు నడపుతూ రావడం వల్ల అలసిపోయి ఈతకోట దగ్గర ఆగిపోయాడు. అలా వారు తెల్లవారే దాకా అక్కడే ఉండి కారులో విశ్రాంతి తీసుకున్నా, ఈతకోటలో ఉన్న తమ బంధువులు ఇంటికెళ్లినా ప్రాణాలు మిగిలేవని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొడుకు కుటుంబం చిన్నాభిన్నం కావడంతో విజయ్‌కుమార్ తల్లిదండ్రులు వీరవెంకట సత్యనారాయణ, లక్ష్మి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బతికే అవకాశం వచ్చి..చేజారి..

కారు పంట కాల్వలోకి దూసుకెళ్లిన తర్వాత విజయ్‌కుమార్ వెంటనే తేరుకుని వెనుక డోర్‌ను ఓపెన్ చేసి బయటకు వచ్చాడు. ఆ సమయంలో భార్య ఉమా, ఓ కుమారుడిని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చాడు. మరో కుమారుడు కోసం మళ్లీ నీటిలోకి వెళ్లాడు. అయితే ఇక్కడ కూడా అతడికి విధి సహకరించలేదు. ఒడ్డుకు చేరిన భార్య, కుమారుడు ఆ చిమ్మ చీకట్లో తెలియక కాలుజారి మళ్లీ అదే కాలువలో మునిగిపోవడం అత్యంత విషాదం. కుటుంబం మొత్తం నీటిలో మునిగిపోవడం, సాయం చేయడానికి ఒక్కరూ లేకపోవడం అయినా తానొక్కడే ఆ చీకట్లో నీటిలో రక్షించే ప్రయత్నం చేయడం.. కొన్ని నిమిషాల పాటు విజయ్‌కుమార్ భరించిన బాధ వర్ణనాతీతం.. ఈ ఘటనతో అతను షాక్‌కు గురయ్యాడు. ఒడ్డుకు చేర్చింది చిన్న కుమారుడో, పెద్ద కుమారుడో కూడా అతను చెప్పలేకపోయాడు. మరోవైపు భార్య, కుమారుడు మృతదేహాల వద్ద విజయ్‌కుమార్ రోదించిన తీరు కలచివేసింది.

చాలా బాధాకరం : ఎమ్మెల్యే గిడ్డి

చింతావారిపేట వద్ద జరిగిన ఘటన చాలా బాధాకరమైనదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రమాద ఘటన వివరాలను విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహాయక చర్యలను పర్యవేక్షించారు.

రేపు రాజమహేంద్రవరంలో ఆదాయ పన్ను శాఖ సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురువారం ఆదాయపు పన్నుల శాఖ వివాద్ సే విశ్వాస్ - 2024 అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఛాంబర్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్(విశాఖపట్నం), జాయింట్ కమిషనర్ డి.హేమ భూపాల్ హాజరవుతారన్నారు. వర్తకులంతా హాజరుకావాలని సూచించారు.

ఎమ్మెల్సీగా గోపిమూర్తి గెలుపుపై హర్షం


ఉండ్రాజవరంలో స్వీట్లు పంచుతున్న ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొర్రా గోపి మూర్తి విజయం సాధించడంపై యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు మంగళవారం ఉండ్రాజవరంలో సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా సహాయ అధ్యక్షుడు ఐ.రాంబాబు, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు వైవీ స్వామి, లక్ష్మీనారాయణ, ఎస్.తాతారెడ్డి, వెంకటలక్ష్మి, బి.రామారావు, కె.రామకృష్ణ, ఆర్ఎస్ ఫణి పాల్గొన్నారు.

నాగమ్మ పుట్టను దర్శించుకున్న మంత్రి దుర్గేష్



పెరవలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కానూరులో కాపుల వినాయకుడి ఆలయం వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన నాగమ్మ పుట్టను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులు ఐకమత్యంతో వివిధ సామాజిక సేవలు చేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం కానూరు పెండ్యాల రోడ్డులో ఉన్న దానమ్మ గుడి వద్ద లారీ ఓనర్స్ అసోసియేషన్ వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆకం సుబ్బారావు, చోడపనీడి నర్సింహమూర్తి, సాధనాల శ్రీనివాస్, కొమ్మిశెట్టి రామకృష్ణ, రంకిరెడ్డి ప్రసాద్, కోలా సీతయ్యనాయుడు, చింటు, అంబటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.